గ్రామ పాలనలో పంచాయతీరాజ్ కీలక పాత్ర
- కలెక్టర్ పి. రంజిత్‌భాషా
- ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం
- ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల ప్రదానం

7లో

సిబ్బందికి ఇబ్బందులు

కార్యాలయం తరలింపుతో అవస్థలు



మూటల్లో ఉన్న ఫైల్స్

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ శాఖలోని పీఐయూ కార్యాలయాన్ని హడావిడిగా కర్నూలు నుంచి నంద్యాలకు తరలించారు. ఈ కార్యాలయ భవన సముదాయం సిద్ధంగా లేక పోవడంతో సామగ్రి ఎక్కడ పడితే అక్కడ ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. నంద్యాలలోని పంచాయతీ రాజ్ భవనంపై ఉన్న ఒక గదిని పీఐయూకి కేటాయించారు. ఆ గదికి కిటికీలకు తలుపులు ఏర్పాటు చేయకపోవడంతో ఫైళ్ళకు ఏమాత్రం భద్రత ఉండేదీ అర్థం కావడం లేదు. పైగా కనీస సౌకర్యాలు లేక సిబ్బంది ఇబ్బందిప డుతున్నారు. 2021లో జిల్లా విభజనలో భాగంగా పంచాయరాజ్ శాఖలో ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్(పీఐయూ)బనగానపల్లె, డోన్, నందికొట్కురు, నియోజకవర్గానికి సంబంధించి కర్నూలు డివిజన్ విభాగాన్ని కర్నూలులోని జిల్లా పరిషత్ ఆవరణలో నిర్వహిస్తున్నారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో గత నాలుగు సంవత్సారాల నుండి కర్నూలు జెడ్పీ ఆవరణలోనే పీఐయూ కార్యలయం కొనసాగు తోంది. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చాక నంద్యాల కలెక్టర్ రాజకుమారి గనియా నంద్యాల కు కార్యాలయం రావాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ చూస్తే పీఐయూ కార్యాల యానికి భవనం సిద్ధంగా లేక పోవడంతో వచ్చిన సామగ్రిని ఎక్కడ పడితే అక్కడ ఉంచారు. ఫైళ్లను మూటలు కట్టి పెట్టారు. ఫర్నిచర్ ఎక్కడ పడితే అక్కడ ఉంది. నంద్యాలకు సంబంధిన కార్యాలయం నంద్యాల కు రావడంపట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యాలయం ఈఈ, పీఏటు ఈఈ (డీఈఈ) డీఏఓ సూపరింటెండెంట్, నలుగురు సీనియర్ అసిస్టెంట్లు, నలుగురు జూనియర్ అసిస్టెం ట్లు, నలుగురు రికార్డు అసిస్టెంట్లు, నలుగురు జేఈలు, టెక్నికల్ ఆఫీసర్, టీపీఓ, ఇద్దరు టైపిస్టులు, అటెండర్లు కలిపి ప్రస్తుతం 27 మంది సిబ్బంది ఉన్నారు. వీరంతా కర్నూలు నుండి నంద్యాలకు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. కార్యాల యంలో కూర్చోడానికి కూడా సరైన స్థలం లేక మూడు భవనాల్లో సిబ్బంది సిబ్బంది విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయం తరలింపు విషయం ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ ముందు చూపుగా భవనం సిద్ధం చేసుకోక పోవడం గమనార్హం.

పాలిసెట్ పరీక్షపై సమీక్ష

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఈ నెల 30వ తేదీన జరుగనున్న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో డీఆర్‌వో రామునాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పరీక్షా కేంద్రాల ఏర్పాటు, విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలు, కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, ఎండల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పోలీసు అధికారులు, ఏపీఎస్‌పిడీ, సీఎల్, డీఎంహెచ్‌వోలతో ఆయన సమీక్షించారు. విద్యార్థులు ఖచ్చితంగా ఉదయం 10గంటలలోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు.



మంత్రిగారి బంధువు..!

నంద్యాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 'అధికారం మనదే.. మనల్ని ఎవరు అడ్డుకునేది..' అన్నట్టుగా సాగుతోంది నంద్యాలలో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల తీరు. ఓ వైపు రాష్ట్రాన్ని ప్రగతిపథం వైపు నడిపించేందుకు చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ముందుకు వెళ్తుంటే క్షేత్రస్థాయిలో మాత్రం అధికార టీడీపీకి, ప్రజాప్రతినిధులకు చెడ్డపేరు తెస్తున్నారు. వీరిలో ముఖ్యంగా జిల్లాలో ఓ మంత్రి సమీప బంధువు(మండల ఇన్‌చార్జి) ఆగడాలు, అధికారదర్పం రోజురోజుకూ పెరుగుతోంది. మంత్రి కావడంతో సాధారణంగా ఆయన రాష్ట్ర కార్యాలయం, సచివాలయం, ఢిల్లీ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఓ కీలక శాఖకు మంత్రిగా బాధ్యతలు చక్కబెడుతున్న మంత్రి నిత్యం రాష్ట్రస్థాయిలో సమీక్షలు, అభివృద్ధి, తన శాఖకు చెందిన పనులపై బిజీగా ఉన్నారు. ఆ బిజీ వ్యవహారమే ఇప్పుడు మంత్రిగారి బంధువుకు అందివచ్చిన అవకాశమైంది. 'మంత్రి మా బంధువే.. నేను చెప్పినట్లు విను...' అంటూ తనదైన శైలిలో బరితెగించడం పలు విమర్శలకు తావిస్తోంది. చిన్నా,పెద్ద అనే తేడా లేకుండా వ్యాపారులైనా.. ఉద్యోగులైనా ఆదాయం పొందే ఏ వర్గాల వారైనా సరే అడిగినంత ఇవ్వాల్సిందే. చెప్పింది చేయాల్సిందే. లేకుంటే ఆ వర్గాలను భయభ్రాంతులకు గురిచేసి వారిని తమదారికి తెచ్చుకుంటారు. గనుల వ్యాపారులు, బియ్యం మాఫియాల నుంచి రూ.కోట్లలో బెదిరింపు ధోరణిలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం. ఒక్కమాటలో చెప్పాలంటే సదరు మంత్రి బంధువు ఆగడాలను తట్టుకోలేక వ్యాపారాలు చేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి. ఏది ఏమైనా నంద్యాల జిల్లాలో ఓ నాయకుడి అవినీతి దందా ఇటు మంత్రితో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు తెస్తోంది.



- మంత్రి సమీప బంధువు కావడంతో బెదిరింపులు
- మైనింగ్‌లో ఆయన మాటే శాసనం
- బిజీ షెడ్యూల్‌లో మంత్రి...
- లోకల్‌గా 'బంధుత్వం' పేరుతో దర్బార్
- ఆ నేత తీరుతో పార్టీకి, ప్రభుత్వానికి నష్టమే!
- ఓ టీడీపీ నాయకుడి దందా పర్వం

ఆయన తీరే వేరు..!

నంద్యాల జిల్లాలోని ఓ మంత్రి సమీప బంధువైన నాయకుడి (మండల ఇన్‌చార్జి) అవినీతి దందాపై జిల్లా వ్యాప్తంగా విమర్శలు గుప్పుమంటున్నాయి. బియ్యం మాఫియా నుంచి గనుల వ్యాపారుల వరకు సదరు నాయకుడి దందా అధికమైంది. సదరు నాయకుడు సైతం తమ సమీప బంధువుతో పాటు మరికొందరిని అనుచరులుగా పెట్టుకుని అక్రమ వసూళ్లకు తెరలేపారు. ఇందులో వైసీపీ నాయకులను కూడా పెట్టుకుని దందాకు పాల్పడుతున్నాడు. మంత్రి బంధువు అని చెప్పుకుంటూ గనుల వ్యాపారులను బెదిరిస్తున్నారు. పలు ఫిర్యాదుల నేపథ్యంలో మంత్రి హెచ్చరించినా ఆ అధికార పార్టీ నాయకుడు తన పంథాను మార్చుకోలేదు. మొత్తంగా అధికారం వచ్చింది కదా..? మంత్రి కూడా తమ బంధువే కదా...? ఏమి చేసుకుంటారో చేసుకోండి అనేలా ఆ నేత తీరు మారింది.

అడిగినంత ఇస్తేనే.. లేకుంటే కరెంట్ కట్..!

నంద్యాల జిల్లాలోని ఆ ప్రాంతాల్లో నాపరాళ్ల గనులు ఎక్కువగా ఉంటాయి. ఏళ్ల తరబడి చాలా మంది వ్యాపారాలు సాగిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మంత్రిగారి బంధువు, టీడీపీ నాయకుడి కన్ను వీటిపై పడింది. ఈ నేపథ్యంలో ఆయా మండలాల్లోని కొందరు గనులకు సంబంధించిన వ్యాపారులపై తమ అనుచర వర్గాన్ని పురమాయించి రూ.లక్షల్లో డిమాండ్ చేశారు. 'అడిగినంతా ఇస్తావా..? లేకుంటే నీ గనులకు విద్యుత్ సరఫరా ఆపేయమంటావా..' అని బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. మొత్తంగా సదరు నాయకుడి దందాతో గనుల వ్యాపారులు సైతం అల్లాడిపోతున్నారు. సదరు నేత వ్యవహారంతో టీడీపీ కేడర్‌కు ముప్పు కలిగే అవకాశం ఎంతైనా ఉంది.



మంత్రి బంధువుపై ఆరోపణల్లో కొన్ని..

- మంత్రి నియోజకవర్గం పరిధిలోని మూడు మండలాల పరిధిలోని గనుల వ్యాపారులు జోరుగా సాగుతుంటాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఉండే సుమారు 15 మంది గనుల యజమానులను వివిధ రూపాల్లో తమ అనుచరులతో బెదిరించి భయభ్రాంతులకు గురి చేశారని బాధిత వర్గాల సమాచారం. ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల నుంచి 15 లక్షలు డిమాండ్ చేసినట్లు తెలిసింది. దీంతో ఆయా యజమానులు సదరు నాయకుడు, అనుచరులపై పలుమార్లు మంత్రికి కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం.
- ఆ ప్రాంతంలో పవర్ గ్రిడ్ సంస్థ నేతృత్వంలో ఓ కంపెనీ సిమెంట్ కంపెనీ దగ్గర నుంచి మరోకచోటకు టవర్స్ లైన్స్ పనులు చేస్తుండగా.. సదరు నాయకుడు (తమ పరిధి కాకపోయినా) అనుచరుడిని పంపించి కంపెనీ వారిని బెదిరించి పనులు ఆపించి సుమారు రూ.12 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. ఇది తెలుసుకున్న మరో స్థానిక లీడర్ సైతం స్థానిక రైతులను వెంట బెట్టుకుని మరోమారు సదరు కంపెనీ వారిని బెదిరించారు. 'మాకు కూడా డబ్బులివ్వాలిందే'నని బెదిరించారని సమాచారం. దీంతో చేసేదేమీ లేక సదరు కంపెనీ రూ.10 లక్షలు ఇచ్చుకున్నట్లు తెలిసింది. కంపెనీ స్థానిక నాయకుడికి మామూళ్లు ముట్టచెప్పినట్లు సమాచారం.
- ఇతర జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తమ పరిధిలోని ఓ గనిని లీజుకు తీసుకున్నాడు. విషయం తెనుకున్న నేత తెలిసిన సదరు నాయకుడు సదరు గని పనులను ఆపించి సదరు యజమాని నుంచి కూడా సుమారు రూ.12 లక్షలు వసులు చేశారని తెలిసింది.
- ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు తరలించే పాలిషింగ్ స్లాబ్స్ లారీలను చెక్‌పోస్టుల్లో పట్టుకోకుండా వైసీపీకి చెందిన ఓ వ్యక్తిని పెట్టుకుని మరీ సదరు నాయకుడి సమీప బంధువు ద్వారా కథ నడిపిస్తున్నారు. రోజుకు 20 లారీలు వరకు రెండు మార్గాల నుంచి తాడిపత్రి, గుంతకల్లు మీదుగా అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఒక్కో లారీ నుంచి రూ.7 వేలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.



నిర్మానుష్యంగా కనిపిస్తున్న సంజీవనగర్ నుంచి శ్రీనివాస సెంటర్ వెళ్లే రోడ్డు

భానుడి ఉగ్రరూపం

- పాణ్యంలో అత్యధికంగా 43.91 డిగ్రీల నమోదు
- మంత్రాలయంలో 43.59 డిగ్రీలు
- రాత్రి గాలి లేక ఉక్కపోత..
- ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలు



నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. రాయలసీమలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. వాతావరణ విపత్తుల శాఖ అధికారులు రోజురోజుకు ఎండలు పెరిగి పోతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, జాగ్రత్తలు తీసుకోవాలని వారు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా పాణ్యంలో 43.91డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది. రుద్రవరంలో 43.48, దొర్నిపాడులో 43.10, బండిఆత్మకూరులో 43.09, గోస్పాడులో 42.83, నంద్యాలలో 42.79, మహానందిలో 42.74, జూపాడుబంగ్లాలో 42.42, గడివేములలో 42.40, ఆళ్లగడ్డలో 42.36 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కర్నూలు జిల్లాలో మంత్రాలయంలో 43.59, కర్నూలు నగరంలో 43.00, కోడుమూరులో 42.79, కౌతాళంలో 42.50, కోసిగిలో 42.00, ఆస్పరిలో 41.53, వెల్దుర్తిలో 41.49, ఓర్వకల్లులో 41.29, సి.బెళగల్‌లో 41.29, కల్లూరులో 41.24 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది.

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీగా చంద్రశేఖర్



కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్స్‌లర్‌గా కర్నూలు మెడికల్ కాలేజీకి చెందిన సీనియర్ కార్డియోలజిస్టు డాక్టర్ పుల్లాల చంద్రశేఖర్ నియమితు లయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిఫారసుతో వైస్ చాన్స్‌లర్‌గా చంద్రశేఖర్‌ను ప్రభుత్వం నియమించింది. కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అంచెలంచెలుగా వైస్ చాన్స్‌లర్ పదవిని అధిరోహించారు. రాయలసీమ ప్రాంతం నుంచి మొదటిసారిగా చంద్రశేఖర్ ఈ పదవిలో నియమితులు కావడం విశేషం. చంద్రశేఖర్ ఎంబీబీఎస్‌ను 1977-83 ఎండీ జనరల్ మెడిసిన్, రెండు కర్నూలు మెడికల్ కాలేజీలో డీఎం కార్డియాలజీ వేలూరులో పూర్తి చేశారు. 1997 నుంచి 2003 వరకు కేఎంసీలో కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, 2023 వరకు ప్రొఫెసర్‌గా పని చేశారు. 2017-19 వరకు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేశారు.

జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి దాహం తీరడం లేదు. బిందెడు నీటి కోసం పడుతున్న అవస్థలు ఎన్నో. ఏళ్ల తరబడి ఫ్లోరైడ్ సమస్యతో తల్లడిల్లిపోతున్నారు. ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో గత టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఎనిమిది మండలాలను ఎంపిక చేసి.. 211 గ్రామాలకు ఫిల్టర్ చేసిన స్వచ్ఛమైన తాగు నీరు ఇవ్వాలని రూ.14.25 కోట్లు ఖర్చు చేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎన్టీఆర్ పేరు తొలగించి వైఎస్ఆర్ పేరు చేర్చారే తప్ప.. ప్రాణ జలం అందించే పథకాన్ని అటకెక్కించారు. రెండు మండలాల్లో అరకొరగా పని చేస్తున్నా.. మిగిలిన ఆరు మండలాల్లో ఈ పథకం వల్ల ప్రజల దాహం తీరడం లేదు. దీని కోసం ఖర్చు చేసిన రూ.కోట్ల ప్రజాధనం నిరర్థకంగా మారింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది కావస్తున్నా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాల నిర్వహణపై దృష్టి సారించలేదనే విమర్శ వినిపిస్తోంది.



వెల్దుర్తిలో నిరుపయోగంగా ఎన్టీఆర్ సుజల స్రవంతి యూనిట్

సుజలం.. విఫలం

- ఉమ్మడి జిల్లాలో 8 మండలాల్లో 'ఎన్టీఆర్ సుజల స్రవంతి' యూనిట్లు
- వైసీపీ హయాంలో నిర్లక్ష్యం
- అలంకారప్రాయంగా తాగునీటి పథకాలు
- రూ.14.25 కోట్లు నీటిపాలు
- కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తే రూ.5లకే స్వచ్ఛ జలాలు

కర్నూలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని కోడుమూరు, వెల్దుర్తి, కృష్ణగిరి, కౌతాళం, నందవరం, తుగ్గలి, నందికొట్కూరు, కొలిమిగుండల్ల మండలాల్లో 2018లో నాటి టీడీపీ టీడీపీ ప్రభుత్వం ఫ్లోరైడ్ సమస్యతో ఎన్నో ఇబ్బందులు పడుతున్న 211 గ్రామాల్లో 3.50 లక్షల జనాభాకు శుద్ధి చేసిన స్వచ్ఛమైన తాగునీరు అందించే కార్యక్రమానికి నాంది పలికింది. ఒక మండలాన్ని ఒక క్లస్టర్‌గా ఎంపిక చేసి ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద ఒక్కో క్లస్టర్‌కు రూ.3.06 కోట్లు మంజూరు చేసింది. భూగర్భ జలాలు పుష్కలంగా మండల కేంద్రం ప్రాంతంలో గంటకు 10 వేల లీటర్ల నీటిని ఫిల్టర్ మదర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. నీటిని శుద్ధి (ఫిల్టర్) చేసే యంత్ర సామగ్రి ఏర్పాటు చేశారు. ఆ క్లస్టర్ పరిధిలో ప్రతి పల్లెలో జనాభాకు అనుగుణంగా తాగునీరు అందించేందుకు వీలుగా 'రిమోట్ డిస్పెన్సింగ్ యూనిట్స్ (ఆర్‌డీయూ) ఏర్పాటు చేశారు. మదర్ ప్లాంట్ నుంచి ఆర్‌డీయూలకు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేందుకు ఒక్కో క్లస్టర్‌కు నాలుగు ట్రాక్టర్లు, నీటి ట్యాంకులు కొనుగోలు చేశారు. ఈ లెక్కన ఒక్కో క్లస్టర్‌కు రూ.1.25 కోట్ల నుంచి రూ.2.50 కోట్లు చొప్పున రూ.14.25 కోట్లు ఖర్చు చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు. గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుధ్య విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఇంజనీర్ల పర్యవేక్షణలో నిర్మాణ పనులు పూర్తి చేశారు. రూ.కోట్లు ప్రజాధనం ఖర్చు చేసిన తాగునీటి ప్లాంట్లు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. ట్రాక్టర్లు, ట్యాంకర్లు వినియోగం లేక తుప్పు పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వైసీపీ హయాంలో అటకెక్కించారు

ఎన్టీఆర్ సుజల స్రవంతి ఆర్‌డీయూ ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన ట్యాంకులో ఫిల్టర్ నీటిని నింపుతారు. నీళ్లు కావాల్సిన వాళ్లు రూ.5 కాయిన్ వేస్తే 20 లీటర్లు ఫిల్టర్ నీరు బిందెలో పడేలా టెక్నాలజీ అనుసంధానం చేశారు. దశాబ్దాలుగా వెంటాడుతున్న ఫ్లోరైడ్ కష్టాలు తీరుతాయని ప్రజలు ఆశిస్తే.. 2019 మేలో వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఫ్లోరైడ్ పీడిత ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని వైఎస్ఆర్ సుజల స్రవంతి పథకంగా పేరు మార్చేరే తప్ప నిర్వహణను గాలికొదిలేశారు. కరెంట్ బిల్లులు కూడా కట్టలేని దుస్థితికి తీసుకొచ్చి అటకెక్కించారు. వీటి నిర్వహణ కాంట్రాక్టర్లకు వైసీపీ హయాంలో సకాలంలో నిర్వహణ బిల్లులు కూడా చెల్లించకపోవడంతో చేతులెత్తేశారు. కౌతాళం, నందవరం, కొలిమిగుండ్ల మండలాల్లో మాత్రం కొన్ని గ్రామాలకు ఫిల్టర్ నీటిని అందిస్తున్నామని ఇంజనీర్లు పేర్కొంటున్నారు

మిగతా 6వ పేజీలో



కోడుమూరులో చెత్తా చెదారం మధ్య నిరుపయోగంగా ఎన్టీఆర్ సుజల స్రవంతి రూరల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ (ఆర్‌డీయూ)

గడ్డుకాలంలో మామిడి


పెనుగాలులకు రాలిపడిన మామిడి కాయలు

ఆత్మకూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మామిడి పంట చేతికి వచ్చేదాకా గండమే. తెగుళ్ల, ప్రకృతి విపత్తులు ఎప్పుడైనా దాడి చేయవచ్చు. చేతికి వచ్చిన కాపు చెల్లా చెదరు కావచ్చు. ఈ ఏడాది మామిడి రైతులకు అలాంటి కష్టమే దాపురించింది ఎంతో కష్టపడి మామిడి తోటలను కంటి రెప్పలా కాపాడుకుంటే, పంట చేతికొచ్చే సమయంలో తెగుళ్ల బెడదతో పాటు ప్రకృతి విపత్తులు మామిడి రైతులకు శాపంగా మారుతున్నాయి. వాస్తవానికి గత కొన్నేళ్లుగా మామిడి దిగుబడులు క్షీణిస్తూ వస్తున్నాయి. వాతావరణ పరిస్థితుల్లో మార్పులే దీనికి కారణం. సకాలంలో మామిడి పూత రావడం లేదు. కొంతమేర పూత వచ్చినప్పటికీ పగటివేళల్లో అధిక ఉష్ణోగ్రతల వల్ల పూత ఎండుదశకు చేరుకుని దిగుబడి తగ్గిపోయింది. దీనికితోడు తెనే మంచు పురుగు పూతపై ప్రభావం చూపడం వల్ల పూతదశలోనే పంట దెబ్బతిన్నది. ఒకవేళ పూత దశ నుంచి పంటను కాపాడినప్పటికీ కాయలను కూడా తేనె మంచు పురుగు ఆశించడం వల్ల దిగుబడులు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో కేవలం పెద్ద మామిడి చెట్లు మినహాయిస్తే.. చిన్నచిన్న చెట్లకు మామిడి కాయలు కాయని పరిస్థితి నెలకొంది. ఈ తరహా ఇబ్బందులతో ఈ ఏడాది కనీసం పెట్టుబడులు, కూలీల ఖర్చులు కూడా సమకూరడం లేదని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి ప్రస్తుత వేసవిలో సాయంత్రవేళల్లో బలమైన పెనుగాలులతో పాటు అకాల వర్షాల వల్ల ఉన్న కొద్దిపాటి కాయలు కూడా నేల రాలిపోతూ మరింత నష్టాలకు గురవుతున్నట్లు బాధిత రైతులు వాపోతున్నారు.

ఆత్మకూరు డివిజన్‌లో 370 ఎకరాల్లో వరకు మామిడి సాగు

ఆత్మకూరు డివిజన్ పరిధిలో గత కొన్నేళ్లుగా మామిడి తోటలను రైతులు విస్తారంగా సాగుచేస్తున్నారు. ఇందులో భాగంగా వెలుగోడు మండలంలో 220 ఎకరాలు, ఆత్మకూరులో 60 ఎకరాలు, కొత్తపల్లిలో 75 ఎకరాలు, పాములపాడులో 15 ఎకరాల చొప్పున మొత్తం 370 ఎకరాల్లో రైతులు మామిడి తోటలను సాగు చేశారు. ఆయా తోటల్లో ప్రధానంగా బేనిషా, అమృతం, అరటిబేనిస, రెడ్‌పసంత్, మల్గోవా, ఆచారి, నీలాలు, తోతపూరి చట్నీకాయల జాతుల చెట్లను పెంచుతున్నారు. ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలతో పాటు తెనె మంచు పురుగు ఉధృతి కారణంగా అనేక జాతుల చెట్లకు ఆశించిన స్థాయిలో దిగుబడులు రానట్లు రైతులు పేర్కొంటున్నారు. దీనికితోడు వడగాలులు, పెను గాలుల తీవ్రత వల్ల ఉన్న కాయలు కూడా దెబ్బతిని రాలిపోతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ ఏడాడి మామిడి పంటల దుస్థితిపై ప్రభుత్వం స్పందించాలని మామిడి రైతులు కోరుతున్నారు. అయితే మామిడి కాయలు రాలి జరిగిన నష్టానికి ఎలాంటి పరిహారం వర్తించదని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం బలమైన గాలుల తీవ్రత వల్ల పంటలో 33శాతం చెట్లు విరిగినప్పుడే పంటనష్టం వరిస్తుందని అంటున్నారు. దీంతో మామిడి రైతులు కుదేలవుతున్నారు. అకాల వర్షాలు, పెనుగాలుల వల్ల తీవ్రంగా నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వం కంటితుడుపు చర్యలు కూడా లేకపోవడంతో మామిడి రైతులకు గడ్డు పరిస్థితులు తప్పడం లేదు.


రాలిపడిన మామిడి కాయలు


పెనుగాలులకు విరిగిపడిన మామిడి చెట్టు

- తెగుళ్ల బెడదతో గణనీయంగా తగ్గిన దిగుబడులు
- పెనుగాలుల ప్రభావంతో మరింత నష్టం
- ఉద్యానశాఖ ద్వారా తోడ్పాటు కరువు
- ఆందోళనలో రైతులు

పెనుగాలుల ధాటికి తీవ్రంగా నష్టపోయా



ఈ ఏడాది ఏప్రిల్ నెలలో సంభవించిన పెనుగాలులు, అకాల వర్షాల ధాటికి తీవ్రంగా నష్టపోయాం. ఏప్రిల్ నెలలోనే నాలుగైదు సందర్భాల్లో గాలుల బీభత్సం వల్ల మామిడి కాయలు నేల రాలిపోవడంతో పాటు భారీ వృక్షాలు సైతం విరిగిపోవడంతో తీవ్రంగా నష్టం వాటిల్లింది. ఏడాదంతా కష్టపడి మామిడి తోటలను కంటికి రెప్పలా కాపాడుకుంటే పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి విపత్తులు చోటుచేసుకోవడంతో పెట్టుబడులు కూడా చేతికి రావడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

- మొహబతుల్లా, మామిడి రైతు, ఆత్మకూరు

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఆత్మకూరు ప్రాంతంలో సంభవించిన పెనుగాలుల తీవ్రత వల్ల మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయిన విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయితే నిబంధనల ప్రకారం పెనుగాలుల ధాటికి పంటలో 33శాతం మామిడి చెట్లు నేలకూలి నష్టాన్ని మిగిల్చినప్పుడు మాత్రమే ప్రభుత్వం పరిహారం మంజూరు చేస్తోంది. ఈ విషయాలను ఇప్పటికే బాధిత రైతులకు తెలియజేశాము. అదేవిధంగా తేనె మంచు పురుగు ఉధృతి తీవ్రంగా ఉండటం వల్ల తొలి నుంచే రైతులకు మామిడి తోట సస్యరక్షణలపై అవగాహన కల్పిస్తూ వచ్చాము.

- చందన, ఉద్యానశాఖ అధికారి, ఆత్మకూరు

దిగుబడులపై తేనె మంచు పురుగు ప్రభావం



పంట పూత, పిందె దశలో ఉన్నప్పుడు తేనె మంచు పురుగు ఉధృతి వల్ల పూత రాలిపోవడంతో పాటు పిందె దశలో కాయలు కూడా దెబ్బతింటున్నాయి. నాలుగైదేళ్లుగా ఈ పురుగు ఉధృతి తీవ్రంగా ఉండటం వల్ల దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీంతో సస్యరక్షణకు అధికంగా పెట్టుబడులు కావాల్సి వస్తోంది. అయితే ఎలాగోలా పంటను కాపాడుకుంటే చివరికి పెనుగాలులు, అకాల వర్షాల ధాటికి మామిడి కాయలు రాలి తీవ్రమైన నష్టం వాటిల్లుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం మామిడి రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలి.

- లాలు, మామిడి రైతు, ఆత్మకూరు

కర్నూలులో రైల్వే డీజీఎం ఆకస్మిక పర్యటన

- రైల్వే వర్క్‌షాప్ పనుల పరిశీలన


కర్నూలు రైల్వేస్టేషన్‌లో పర్యటిస్తున్న జనరల్ మేనేజర్

కర్నూలు రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ జనరల్ మేనేజర్(డీజీఎం) అరుణ్‌కుమార్ జైన్ గురువారం కర్నూలులో ఆకస్మికంగా పర్యటించారు. ఉదయం సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో బయలుదేరి ఆయన మధ్యాహ్నం 12:30 గంటలకు కర్నూలు సిటీ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ప్రత్యేక వాహనంలో బయలుదేరి జోగుళాంబ-పంచలింగాల మధ్య నిర్మిస్తున్న కోచ్‌మిడ్‌లైఫ్ రిహాబిలిటేషన్ రైల్వే వర్క్‌షాపునకు చేరుకుని నూతన లైన్ అనుసంధానానికి సంబంధించిన నిర్మాణ పనులను పరిశీలించారు. కొత్త లైన్, వర్క్‌షాప్ నిర్మాణ పనుల పురోగతిపై రైల్వే అధికారులతో సమీక్షించారు. వర్క్‌షాప్ నిర్మాణ పనులకు 2013-14 సంవత్సరంలో ప్రాథమికంగా రూ.283 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేయబడిన తర్వాత దానిని రూ.562 కోట్లకు పెంచినట్లు రైల్వే అధికారులు జీఎంకు వివరించారు. ఈ వర్క్‌షాప్ పూర్తి అయితే నెలకు దాదాపు 50 కోచ్‌లను మరమ్మత్తు చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వివరించారు. మొదట దశలో నాన్-ఏసీ కోచ్‌ల మరమ్మతు పనులను చేపట్టే పని పూర్తవుతుందన్నారు. తర్వాత ఏసీ కోచ్‌ల నిర్వహణ పనులు చేపట్టడానికి వర్క్‌షాప్‌ను పెంచుతారని జీఎంకు సంబంధించిన అధికారులు కులంకుశంగా వివరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

వర్క్‌షాప్ పరిశీలన అనంతరం కర్నూలు సిటీ రైల్వేస్టేషన్‌కు చేరుకుని స్టేషన్‌లో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను డీజీఎం పరిశీలించారు. ప్రధానంగా ప్రయాణికుల సౌకర్యాలు, వసతులు, సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. కర్నూలు సిటీ రైల్వేస్టేషన్‌లో రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఆయన ప్రారంభించారు. అందుబాటులో ఉన్న ఓపెన్ జిమ్ ఆటస్థలం వంటి వాటిపై సమీక్షించారు. రైల్వే ఉద్యోగ కుటుంబ సభ్యుల కోసం రైల్వే శాఖ అందించిన ఆధునిక క్రీడా పరికరాలను ఉపయోగించుకోవాలని అరుణ్ కుమార్‌జైన్ సూచించారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు తిరిగి ప్రత్యేక రైల్లో సికింద్రాబాద్‌కు వెళ్లారు. ఆయన వెంట రైల్వే డీఆర్‌ఎం లోకేష్ విష్ణోయ్, డివిజనల్ రైల్వే సీనియర్ అధికారులు, కర్నూలు సిటీ రైల్వేమేనేజర్ శేషఫణి తదితరులు ఉన్నారు.

సుజలం.. విఫలం


తుగ్గలి మండలం ఉప్పర్లపల్లెలో నిరుపయోగంగా ఉన్న సుజల స్రవంతి యూనిట్.. తుప్పు పడుతున్న ట్యాంకర్లు

(5వ పేజీ తరువాయి)

తుగ్గలి మండలం ఉప్పర్లపల్లెలో ఎన్టీఆర్ సుజల స్రవంతి మదర్ ప్లాంట్, 14 గ్రామాల్లో 26 రిమోట్ డిస్పెన్సింగ్ యూనిట్స్ (ఆర్‌డీయూ) ఏర్పాటు చేశారు. మదర్ ప్లాంట్ నుంచి ఆర్‌డీయూలకు నీటిని సరఫరా చేసేందుకు నాలుగు ట్రాక్టర్లు, ట్యాంకులు కొనుగోలు చేశారు. ఒక్కో ట్రాక్టరు, ట్యాంకర్‌కు రూ.6.50 లక్షలకు పైగానే ఖర్చు చేశారు. మొత్తం యూనిట్‌కు రూ.1.24 కోట్లు వెచ్చించారు. నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారడంతో ట్రాక్టర్ల టైర్లు పనికిరాకుండా పోయాయి. ట్యాంకర్లు తుప్పు పడుతున్నాయి. కరెంట్ బిల్లులే రూ.24 లక్షలు బకాయి చెల్లించాల్సి ఉంది. ఈ ప్లాంట్ వినియోగంలోకి తీసుకురావాలంటే కరెంట్ బిల్లులతో పాటు మరమ్మతులకు రూ.36 లక్షలు అవసరమని ప్రతిపాదనలు పంపారు. తుగ్గలి నీటి పథకం ఒక్కటే కాదు.. అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి ఉంది. కోడుమూరు పట్టణంలో ఆర్‌డీయూలు చెత్త కేంద్రాలుగా మారాయి.

దృష్టి సారిస్తే శుద్ధ జలం

మహోన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాల నిర్వహణపై సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తే ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందే అవకాశం ఉంది. ప్రస్తుతం పలు గ్రామాల్లో ప్రైవేటు ఆర్‌ఓ ప్లాంట్ యజమానులు రూ.10-12లకు 20 లీటర్ల నీటిని ఇంటింటికి సరఫరా చేస్తుండడంతో రిమోట్ డిస్పెన్సింగ్ యూనిట్స్ (ఆర్‌డీయూ)కు వచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదని తెలుస్తుంది. ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి నిర్వహణ బాధ్యతను టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించి, 20-25 లీటర్ల క్యాన్‌కు రూ.8 ధర నిర్ణయించడంతో పాటు ఇంటింటికి సరఫరా చేయాలి. లేదంటే.. ప్రభుత్వమే విద్యుత్ బిల్లులు, నిర్వహణ ఖర్చులు, నిర్వహణ సిబ్బందిని నియమించి నెలనెల గౌరవ వేతనాలు చెల్లించి ప్రజలకు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని, అప్పుడే లక్ష్యం సఫలం అవుతుంది. లేదంటే.. సు'జలం'.. నిష్ఫలమే అవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఆ దిశగా కూటమి ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పంచాయతీలకు అప్పగించాం

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 8 మండలాల్లో ఫ్లోరైడ్ ప్రభావిత 211 గ్రామాలకు శుద్ధి చేసిన తాగునీరు అందించాలని ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద మదర్ ఫిల్టర్ యూనిట్లు, గ్రామాల్లో రిమోట్ డిస్పెన్సింగ్ యూనిట్లు ఏర్పాటు చేశాం. వీటి కోసం రూ.14.25 కోట్లు ఖర్చు చేశాం. నిర్వహణ బాధ్యతను స్థానిక గ్రామ పంచాయతీలకు అప్పగించాం. ప్రస్తుతం నిర్వహణ లేక నిరుపయోగంగా ఉన్న మాట నిజమే. రెండు మూడు మాత్రమే పని చేస్తున్నాయి. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

- నాగేశ్వరరావు, ఎస్ఈ (ఎఫ్ఏసీ), గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం, కర్నూలు

సామాజిక చైతన్య రూపంగా పార్వతయ్య పద్యం

సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ శంకరశర్మ, పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పద్యంతో కవి పార్వతయ్య సామాజిక చైతన్యం కల్పిస్తున్నారని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలోని సాహిత్య వేదిక సమావేశ హాలులో కర్నూలుకు చెందిన కవి డి. పార్వతయ్య రాసిన 'బొమ్మల గాథలు' పద్యకావ్యం పుస్తక ఆవిష్కరణ సభ జరిగింది. ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, పలువురు కవులు, కళాకారుల మధ్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సభలో ముఖ్యవక్తగా పాల్గొన్న కెంగార మోహన్ మాట్లాడుతూ సామాజిక చైతన్యానికి పద్యాన్ని కూడా ఆయుధంగా చేసుకోవచ్చని కవి పార్వతయ్య తన పుస్తకం ద్వారా నిరూపించారని చెప్పారు. బసవేశ్వరుడు, పోతులూరు వీరబ్రహ్మం, వేమన, ఈనాటి ఆధునిక తరంలో గుర్రం జాషువా పద్యాన్ని సామాజిక చైతన్యానికి వాడుకున్నారని, ఆ ఒరవడి నేడు కొందరు ఆధునిక కవులు కొనసాగిస్తున్నారని అన్నారు. అందులో పార్వతయ్య ఒకరని ప్రశంసించారు. పుస్తక సమీక్షకుడు, గజల్ గాయకుడు మహమ్మద్ మియా మాట్లాడుతూ ఈ పద్యకావ్యంలో దేవభక్తి, సామాజిక సమస్యలు, ఉద్యమాలు, అమరవీరుల పోరాట గాథలు, వర్తమాన నేతలు, కళాకారులు కనిపిస్తారని అన్నారు. పద్యాల్లో పార్వతయ్య మానవీయ కోణాన్ని ఆవిష్కరించారని అన్నారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కవి పార్వతయ్య భవిష్యత్తులో మరిన్ని రచనలు చేయాలని ఆకాంక్షిస్తూ ఆయనకు టీజీవీ కళాక్షేత్రం పక్షాన రూ.5వేలు చెక్కును అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ బి. శంకరశర్మ పార్వతయ్య రచనలు యువతరానికి మార్గదర్శకం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి నగర ప్రతినిధులు విజయులు తనగల, వెంకటేశ్వర్లు, ఎంపీ బసవరాజు, విరసం నాయకుడు నాగేశ్వరాచారి, ఏపీ ఎస్పీ డీఎస్పీ మహబూ బ్ బాషా, రాయలసీమ ప్రచురణలు సంస్థ గౌరవ సంపాదకుడు మారుతి పౌరోహితం పాల్గొన్నారు.

కన్నుల పండువగా తిమ్మగురుడు రథోత్సవం

ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు ... రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే


అశేష భక్త జనుల మధ్య తిమ్మగురుడు స్వామి రథోత్సవం

గూడూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తిమ్మగురుడు స్వామి సంపూర్ణ రథోత్సవం అశేష భక్త జనుల మధ్య కన్నుల పండువగా సాగింది. గురువారం గూడూరు పట్టణంలోని తిమ్మగురుడు స్వామి రథోత్సవంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొని పూజలు చేశారు. ఈ రథోత్సవ మహోత్సవానికి తెలంగాణ రాష్ట్రం నుండి కూడా వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ కె రామాంజనేయులు, టీడీపీ నాయకులు రేమట వెంకటేష్, కౌన్సిలర్ రేమట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిణయానికి శుభవేళ

వివాహాలకు మంచి ముహూర్తాలు



నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరం చైత్రమాస శుభవేళ... జిల్లాలో పలు జంటలు మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యే శుభ ముహూర్తాలుకు ఆసన్నమైంది. చైత్రం నుంచి జ్యేష్ఠమాసం వరకూ మూడు నెలల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఈనెల 30వ తేదీ బుధవారం అక్షయ తృతీయ రావడంతో వేల సంఖ్యలో పెళ్లిళ్లు జరుగనున్నాయి. జూన్ 10 నుంచి జూలై 8 వరకు గురుమౌఢ్యమి కావడం, జూన్ 27 నుంచి ఆషాఢమాసం ప్రారంభం కావడంతో ఆనెల రోజులు ముహూర్తాలు లేవని పండితులు చెబుతున్నారు. దీంతో జూన్ 10వ తేదీలోగా వివాహాలు చేసేందుకు హిందూ కుటుంబాలు సిద్ధమయ్యాయి. జ్యేష్ఠమాసం(జూన్) 3,4,5,6,7,8 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. మౌఢ్యమి నెల రోజులు, ఆషాఢమాసంలో మరో నెలరోజులు బ్రేక్ ఇచ్చిన తర్వాత తిరిగి శ్రావణ మాసంలో జూలై 26 నుంచి వివాహాలు ప్రారంభమవుతాయని నంద్యాలకు చెందిన పురోహితుడు రాచమడుగు మురళీకృష్ణ తెలిపారు. వైశాఖ మాసంలో (మే)1,7,8,9,11,17,18,28 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయి. ఇదిలా ఉండగా వివాహాల నిమిత్తం ఇప్పటికే ఫంక్షన్‌హాళ్లు, కల్యాణమండపాలు బుక్ అయ్యాయి. కేటరింగ్, బ్యూటిషియన్స్, లైటింగ్, డెకొరేషన్, బాజాభజంత్రీలు, ట్రావెల్స్, పురోహితులకు, గోల్డ్ షాపులు, ఈవెంట్ నడిపేవారికి డిమాండ్ ఏర్పడింది.

మంచి ముహూర్తాలున్నాయి



అన్ని నక్షత్రాల వారికి ఈనెల 30న మంచి ముహూర్తాలు ఉన్నాయి. 30న మరింతమంచి ముహూర్తం. ఎందుకంటే అక్షయ తృతీయ కలిసింది. దాదాపు 16 మంది ముహూర్తాలు రానున్న నేపథ్యంలో ఉన్నాయి. జూన్ 10 నుంచి మౌఢ్యమి ఆ తరువాత ఆషాఢం కావడంతో దాదాపు రెండు నెలలపాట పెళ్లిళ్లకు బ్రేక్ పడనుంది.

-రాచమడుగు మురళీకృష్ణ శర్మ, పురోహితుడు

మార్కెట్ కమిటీల్లో పాలకవర్గాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని పత్తికొండ, ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు గత నెలలో ప్రభుత్వం చైర్మన్లను ప్రకటించింది. ఇందులో భాగంగా చైర్మన్లతో పాటు డైరెక్టర్లను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపాల్సిందిగా మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఎమ్మిగనూరు, పత్తికొండ వ్యవసాయ మార్కెట్ కమిటీలకు డైరెక్టర్లుగా చైర్మన్లు సూచించిన వారితో ఏడీఎం నారాయణమూర్తి జాబితాలను తయారు చేసి మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు పంపారు.

ఉపాధి కూలీలకు ప్రమాద బీమా

- ఉమ్మడి జిల్లాలో 5 లక్షల కుటుంబాలకు లబ్ధి

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న రైతులు, కూలీలందరికీ తక్షణమే ప్రమాద బీమా చేయించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషితో రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న వారందరికీ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన పథకాల కింద ఈ లబ్ధి కలగనుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 5 లక్షల మంది రైతులు, కూలీలకు ఉపాధి హామీ పథకం కింద పని చేసే వారందరికీ ఈ బీమా పథకం వర్తించేందుకు నీటి యాజమాన్య సంస్థ యంత్రాంగం చర్యలు చేపట్టనుంది. మే నెల 1వ తేదీ నాటికి ఈ మేరకు పని చేసే కూలీల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం ఈ రెండు జిల్లాల నీటి యాజమాన్య సంస్థ అధికారులను ఆదేశించింది. జూన్‌లోపు నమోదు ప్రక్రియ పూర్తి చేసి ప్రతి కుటుంబానికి భరోసా కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన పథకం కింద రూ.450ల ప్రీమియం చెల్లిస్తే పలు ప్రమాదాలకు బీమా లభిస్తుంది.

గ్రామపాలనలో పంచాయతీరాజ్ కీలక పాత్ర

- కలెక్టర్ రంజిత్ బాషా
- ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి, స్థానిక పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. గురువారం జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో జడ్పీ డిప్యూటి సీఈఓ వెంకటసుబ్బారెడ్డి అధ్యక్షతన 32వ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025 సంవత్సరంలో ఉన్న పంచాయతీ రాజ్ వ్యవస్థకు, 1947 స్వాతంత్ర్యం వచ్చినతరువాత ఉన్న పరిస్థితి చాలా వ్యత్యాసం ఉందన్నారు. 73వ సవరణకు ముందుకు స్థిరమైన ప్రామాణిక యంత్రాంగం ఉండేది కాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ,ఎస్టీ,బీసీలకు రిజర్వేషన్లు లేవని, మహిళలకు ప్రాతినిధ్యం ఉండేదికాదన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని సంఘ్వీ, బల్వంత్‌రాయ్ మెహతా తదితర కమిటీలు దేశంలో ఉన్న అత్యున్నత మేధావులు సంస్థలు అధ్యయనం చేసిన తరువాత 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 11వ షెడ్యూల్లో 243 ఆర్టికల్ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థను రూపొందిస్తూ చట్టం చేశారన్నారు. ఆ చట్టాన్ని రాజ్యసభ,లోక్‌సభతో పాటు అన్ని అసెంబ్లీలో కూడ ఆమోదం చేసిన తరువాత 1993 ఏప్రిల్ 24న అమలులోకి రావడం జరిగిందన్నారు. జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం సమర్థవంతంగా అమలు చేశామన్నారు. జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణంలో భాగంగా రూ.80 కోట్లతో 119 కి.మి. రోడ్ల నిర్మాణాన్ని కేవలం 3 నెలల్లో పూర్తి చేశామన్నారు. అనంతరం ఉత్తమ పనితీరు కనబరచిన పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు, పీఆర్ కర్నూలు ఈఈ, ఎంపిడీఓలు, ఈఓఆర్డీలు, పంచాయితీ కార్యదర్శులు జిల్లా పరిషత్, జిల్లా పంచాయితీ కార్యాలయం సిబ్బందికి కలెక్టర్ మెమెంటో, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ వి.రామచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డీఎల్‌పీఓ టి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రఘునాథ్, కర్నూలు ఎంపీడీవో | నాగేశ్వరరావు, ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్ | టి.లక్ష్మీ, డీఎల్‌పీవో, కర్నూలు డివిజన్ | హెచ్‌సీఈ మద్దన్న, పీఆర్ ఈఈ | అల్లాబకాష్, చిప్పగిరి ఎంపీడీవో | ఎ.శివనాగప్రసాద్, గూడూరు ఎంపీడీవో | వరలక్ష్మి, హాలహర్వి ఎంపీడీవో | ప్రశంసాపత్రం అందుకుంటున్న పీఆర్ ఎస్ఈ వి.రామచంద్రారెడ్డి



సుహాసినమ్మ, వెల్దుర్తి ఎంపీడీవో | ఆర్‌వీ కృష్ణారెడ్డి, ఏవో, కోడుమూరు | పుల్లయ్య, ఏవో జిల్లా పరిషత్ | శ్రీనివాసులు, వీడీవో, జిల్లా పరిషత్ | సిద్ధారెడ్డి, సీనియర్ అసిస్టెంట్, జడ్పీ | ఆర్‌బీవీ కృష్ణారావు, జిల్లా పరిషత్ | ప్రభావతి, ఈవోఆర్డీ, మంత్రాలయం | పి.రవికిషోర్, ఈవోఆర్డీ, వెల్దుర్తి

సారా తయారీ, విక్రయాలు మానాలి

- ఉపాధి పథకం, బ్యాంకు రుణాలతో ఆర్థికంగా ఎదగాలి
- న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ, విక్రయాలు నేరమని, వాటిని మానుకొని ప్రభుత్వం కల్పించే ఉపాధి హామీ పథకం, బ్యాంకు రుణాల ద్వారా ఆర్థికంగా ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి సూచించారు. గురువారం మండల పరిధిలోని జీవరాల్‌మాన్ తండాలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడతూ సారా రహితంగా గిరిజన గ్రామాలు తయారు కావాలని అన్నారు. తమ పరిధిలో ఉన్న గిరిజన భూమి తదితర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ హేమ్లా నాయక్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజురావు, టీడీపీ నాయకులు సోమ్లా నాయక్, బీటీ గోవిందు, న్యాయవాదులు దామోదరాచారి, రవికుమార్ పాల్గొన్నారు.

సబ్ జైలు, బాలసదన్‌ను సందర్శించిన న్యాయాధికారి

పత్తికొండ పర్యటనకు వచ్చిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి బాలసదన్ వసతి గృహాన్ని, సబ్‌జైలును సందర్శించి రికార్డులు పరిశీలించారు. అక్కడ వసతులపై ఆరా తీశారు.

గౌడ సత్రం నిర్వహణపై ఈవోకు ఫిర్యాదు

శ్రీశైలం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలోని గౌడసత్రం నిర్వహణ లోపాల గురించి గురువారం ఆర్య గౌడ ఈడిగ అసోసియేషన్ సభ్యులు దేవస్థానం ఏఈవో ఎం. శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. స్థానిక గౌడ సత్రం 2025 జనవరి 9న నూతన కమిటీ ఆధ్వర్యంలో సత్రం నిర్వహణ జరుగుతోందని తెలిపారు. అయితే కొంతమంది వ్యక్తులు, గౌడేతరులు సత్ర నిర్వహణ లావాదేవీలలో కలుగచేసుకుంటూ సత్రాభివృద్ధికి ఆటంకం కలిగిస్తునారని, చర్యలు తీసుకోవాలని ఈవోకు వినతి పత్రం అందజేశారు.

జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా సురేంద్ర

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా కర్నూలుకు చెందిన గుడిపల్లి సురేంద్ర నియమితులయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాంబరులో కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదుగా నియామక పత్రాన్ని సురేంద్ర అందుకున్నారు. అనంతరం సురేంద్ర జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



కలెక్టర్‌కు మొక్క ఇస్తున్న సురేంద్ర

ఘాట్ రోడ్డులో బస్సు ప్రమాదం

- 20 మంది కర్ణాటక భక్తులకు గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం.. కర్నూలుకు తరలింపు



ప్రమాదానికి గురైన టూరిస్టు బస్సు

సున్నిపెంట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం-దోర్నాల ఘాట్ రూట్‌లో టూరిస్టు బస్సు ప్రమాదానికి గురైయింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. వివరాలివీ.. 40 మంది భక్తులు కర్ణాటక రాష్ట్రం సిరిగుప్ప గ్రామం నుంచి తీర్థయాత్ర చేస్తూ బుధవారం శ్రీశైలం వస్తున్నారు. చిన్నారుట్ల గిరిజన గ్రామం వద్ద టూరిస్టు బస్ బ్రేకులు ఫెయిల్ కావడంతో పాటు బస్సు ముందున్న రెండు చక్రాలు బస్సు నుంచి విడిపోయాయి. అప్రమత్తమైన డ్రైవర్ బస్సు లోయలో పడకుండా కొండను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో 20 మంది భక్తులు గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో సున్నిపెంట ప్రాజెక్టు ప్రభుత్వ అసుపత్రికి తరలించి చికిత్స అంద జేశారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాలేదని..

- విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

కర్నూలు క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వెంకటాద్రి నగర్‌కు చెందిన రాజగోపాల్ రెడ్డి (67) అనే రిటైర్డు ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు భార్య, ఇద్దరు కూతుళ్ల సంతానం. వీరు వెంకటాద్రినగర్‌లోని ఓ అపార్టుమెంటులో నివాసం ఉంటున్నాడు. ఈయన మొదట ఏపీ స్టేట్ కోఆపరేటివ్ రూరల్ ఇరిగేషన్ కార్పొరేషన్‌లో డ్రైవర్‌గా పని చేస్తూ తర్వాత డిప్యుటేషన్‌పైన ఏపీఎస్ సీఆర్‌ఏసీ డీడబ్ల్యూఎంఏలో డ్రైవర్‌గా చేరారు. 2015లో రిటైర్డు అయ్యాడు. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఆయనకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు శాలరీ బకాయిలు రాలేదు. ఎన్నిసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగిన ఫలితం లేకపోవడంతో చిన్న కూతురుకు పెళ్లి ఎలా చేయాలని మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఓ వెల్డింగ్స్ దుకాణం వద్ద ఉరి వేసుకుని కనిపించాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య మణికుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మధుసూదన్‌గౌడు తెలిపారు.

విద్యుత్ ప్రమాదంలో మొక్కజొన్న పంట దగ్ధం



కాలిపోతున్న మొక్కజొన్న పంట

పాణ్యం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పాణ్యం గోరుకల్లు రస్తాలో గురువారం విద్యుదాఘాతంతో ఆరెకరాల మొక్కజొన్న పంట దగ్ధమైంది. ఐదెకరాలలో మూడు ఎకరాలు అగ్నికి ఆహుతైనట్లు పాణ్యం గ్రామానికి చెందిన రైతు లింగమయ్య తెలిపారు. లింగాల సుబ్రహ్మణ్యంకు చెందిన రెండెకరాల పంట, గుడిపాటి మద్దిలేటికి చెందిన ఎకరా మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతైంది. సమాచారం తెలిసిన వెంటనే నంద్యాల అగ్నిమాపక సిబ్బంది పంట చేనులోకి వెళ్లడానికి కంచెలు, గెట్లు అడ్డుగా ఉండడంతో కొంత జాప్యం ఏర్పడి నష్టం తీవ్రత పెరిగినట్లు బాధితులు తెలిపారు. ఎకరాకు రూ. 15 వేలు కౌలుతో రూ. 45 వేలు పెట్టుబడి పెట్టి మొక్కజొన్న పంట సాగుచేశామని చెప్పారు. బోరు వద్ద విద్యుదాఘాతంతో ప్రమాదం జరిగినట్లు రైతులు తెలిపారు. అగ్నిమాపక వాహనం పంటచేనులోకి వెళ్లలేకపోవడంతో ఇనుప తీగెల కంచెను తొలగించి చేను పక్కకు వెళ్లి మంటలను ఆర్పివేసినట్లు అగ్నిమాపక సిబ్బంది ఇస్మాయిల్ తెలిపారు.

మెడికో ఆత్మహత్యాయత్నం



మెడికోను పరిశీలిస్తున్న డీఎస్పీ బాబుప్రసాద్, వైద్యులు, హన్షిక దూకిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ చంద్రబాబు

- కర్నూలు విశ్వభారతి మెడికల్ కళాశాలలో ఘటన
- ఇంటర్నల్ పరీక్షలు బాగా రాయలేదని మనస్తాపం
- విద్యార్థిని పరిస్థితి విషమం

గూడూరు/కర్నూలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం పెంచికలపాడు సమీపంలో ఉన్న విశ్వభారతి మెడికల్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంబీబీఎస్ చదువున్న మెడికో అంకె హన్షిక(19) గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కళాశాలలో ఇంటర్నల్ పరీక్షలు బాగా రాయలేదని మనస్థాపానికి గురైన విద్యార్థిని కళాశాల మూడో అంతస్తు నుంచి దూకేసింది. అనంతపురం జిల్లా ఆత్మకూరుకు చెందిన అంకె శ్రీనివాసులు, అనిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వారిలో హన్షిక మొదటి సంతానం. నీట్‌లో ర్యాంక్ సాధించి కేటరిగి-ఏ కింద వైద్య విద్య (ఎంబీబీఎస్) సీటు సాధించింది. నగర శివారులోని విశ్వభారతి మెడికల్ కాలేజీలో సీటు రావడంతో డిసెంబరులో కళాశాలలో చేరింది. కళాశాల యాజమాన్యం ప్రతి రెండు నెలలకు ఒకసారి ఇంటర్నల్ పరీక్షలు నిర్వహిస్తుంది. మొదటి ఇంటర్నల్ పరీక్షలు బాగా రాసి పాస్ అయింది. రెండు రోజుల క్రితం నిర్వహించిన రెండో ఇంటర్నల్ పరీక్షలు బాగా రాయలేదని మానసికంగా మదనపడుతూ తోటి విద్యార్థులతో బాధపడేది. గురువారం తన మిత్రులతో ఇదే విషయంపై బాధపడితే వారు ధైర్యం చెప్పారు. మధ్యాహ్నం తల్లిదండ్రులతో మాట్లాడిన అనంతరం హన్షిక కళాశాల మూడో అంతస్తు పైకెక్కి దూకేసింది. తలకు గాయాలు కాగా, భుజం ఎముకలు, వెన్నెముకలు బాగా దెబ్బతిన్నాయి. ఊపిరితిత్తుల్లో రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమంగా మారింది. మెడికో హన్షిక పై అంతస్తు నుంచి దూకినప్పుడు ఓ విద్యార్థిని చూసిందని పోలీసులు తెలిపారు. అదే కాలేజీలో పీజీ చదువుతున్న జూనియర్ డాక్టర్లు హన్షికను స్కూటిపై ఎక్కించుకొని ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, కర్నూలు తాలుకా సర్కిల్ సీఐ చంద్రబాబు, ఎస్.నాగులాపురం ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సమాచారం తెలియగానే విద్యార్థిని తల్లిదండ్రులు ఆసుపత్రికి చేరుకుని విలపించారు. కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ చంద్రబాబు తెలిపారు.

రెండిళ్లలో చోరీ

నందికొట్కూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఒకే రోజు రెండు ఇళ్లలో దొంగతనం జరిగింది. మంగళవారం రాత్రి పట్టణంలోని సుబ్బారావు పేటకు చెందిన తిరుపాలయ్య, అల్లూరు రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ ఆఫీసు ఎదురుగా బీజేపీ నాయకుడు గూడూరు రవికుమార్‌రెడ్డి ఇంటి తాళం పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతానికి పాల్పడ్డారు. వివరాలివీ.. రవికుమార్ బంధువుల వివాహ పత్రికలను పంపిణీ చేసేందుకు తెలంగాణకు వెళ్లగా ఆయన సతీమణి ఒక్కరు కావడంతో ఇంటికి తాళం వేసి తన సోదరి ఇంటికి వెళ్లారు. ఉదయం ఇంటికి వచ్చి చూస్తే తాళం పగిలి ఉందని, ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో రూ.38 వేలు నగదు, 250 గ్రాముల వెండి, 4 గ్రాముల బంగారు అపహరణకు గురైనట్లు తెలిపారు. అలాగే సుబ్బారావు పేటలో బాలాజీ మెడికల్ స్టోర్ యజమాని తిరుపాలయ్య బెంగళూరులో తమ బంధవుల ఫంక్షన్‌కు వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగిలి ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగు తులాల బంగారం అపహరణకు గురైనట్లు తెలిపారు. ఘటనా స్థలాలను పరిశీలించి బాధితులు ఇచ్చిన ఫిర్యాదును తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



తిరుపాలయ్య ఇంట్లో బీరువానుంచి దొంగలు పడేసిన దుస్తులు



బీజేపీ నాయకుడి ఇంట్లో ఇలా..

మిర్చి రైతుకు నష్టాలు

- భారీగా పడిపోయిన ధరలు



ట్రాక్టరులో ఎండు మిర్చిని విక్రయిస్తున్న రైతు

మిడుతూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వేలకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన మిర్చి రైతులను నష్టాల ఘాటు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. మిడుతూరు మండలంలో జలకనూరు, తలముడిపి, రోళ్లపాడు, ఖాజీపేట, సుంకేసుల, మిడుతూరు, చింతలపల్లి తదితర గ్రామాల్లో రైతులు ఖరీఫ్‌లో1550 ఎకరాల్లో మిరప తోటలు సాగు చేశారు. ఈ ఏడాది మంచి దిగుబడి వస్తుందని భావించినా.. తెగుళ్ల బారిన పడి దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది. ఎకరం మిరప సాగుకు రూ. లక్షకుపైగా ఖర్చు వచ్చింది. పంట దిగుబడిని మార్కెట్‌కు తీసుకువెళ్తే.. క్వింటం రూ. 11వేలకు మించి కొనుగోలు చేయడం లేదు. ఎర్రమిర్చికి గిట్టుబాటు ధరలు లేవని రైతులు కోల్డు స్టోరేజ్‌లకు తరలిస్తున్నారు. గతేడాది గరిష్ఠంగా రూ.20వేలు ధర పలికిన ఎండు మిర్చి, ప్రస్తుతం రూ.11 వేలు కూడ దాటడం లేదు. కొందరు రైతులు ఎండు మిర్చిని ట్రాక్టర్‌లో, ఆటోలలో వేసుకుని గ్రామాలకు తిరిగి రోడ్డుపైన విక్రయిస్తున్నారు. ప్రభుత్వం మిర్చికి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఊరూరు తిరిగి అమ్ముకుంటున్నా..



రెండు ఎకరాల పొలంలో అప్పు చేసి పంటను సాగు చేశాను. ఆశించిన దిగుబడి రాక.. గిట్టుబాటు ధరలేక నష్టాలు మిగిలాయి. కొనేవారు లేక చేసిన అప్పులు తీర్చేందుకు ట్రాక్టరు బాడుగకు తీసుకుని ఊరూరు తిరిగి ఎండు మిరపకాయలు అమ్ముతున్నా. **- రాజన్న, రైతు, జలకనూరు**

పాక్‌పై యుద్ధం ప్రకటించాలి

- హిందూ పరిరక్షణ వేదిక నేతల డిమాండ్
- కర్నూలులో వీహెచ్‌పీ, అనుబంధ సంస్థల భారీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ పరిరక్షణ వేదిక నాయకులు, కార్యకర్తలు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులకు ఊతమిస్తున్న పాకిస్తాన్‌పై యుద్ధం ప్రకటించాలని హిందూ పరిరక్షణ వేదిక నాయకులు డిమాండ్ చేశారు. కశ్మీర్‌లోని పెహల్గావ్‌లో హిందువులపై జరిగిన నరమేధాన్ని తీవ్రంగా నిరసిస్తూ వీహెచ్‌పీ, అనుబంధ సంఘాలు హిందూ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో భారీ నిరసన శాంతి ర్యాలీ నిర్వహించారు. నగరంలోని జడ్పీ కార్యాలయం ఎదుట మహాత్ముడి విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి, ఉగ్రవాదులకు బలి అయిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మహాత్ముడి విగ్రహం ఎదుట నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పెహల్గావ్‌లో జరిగిన ఉగ్రమూకల దాడి హృదయ విదారకంగా ఉందని, ఉగ్రమూకలు ఆధార్ కార్డులు వెతికి, కల్మా చదవమని, చదవని వారిని దారుణంగా తుపాకులతో కాల్చి చంపడం హేయమైన చర్య అని అన్నారు. ఈ నరమేధం వెనుక అనేక కుట్ర కోణాలు ఉన్నాయని, ఇది రాబోయే రోజుల్లో అమర్‌నాథ్ యాత్రకు వచ్చే యాత్రికులను భయపడేలా చేయడమేనన్నారు. కశ్మీర్‌లో పెట్టుబడులు ఆపడం, పర్యాటకులను రాకుండా అడ్డుకోవడం, హిందూ భూములకు, ఆస్తులకు భద్రత లేదనే భావన కల్పించేందుకే పాక్‌మూకలు ఈ దాడులకు తెగబడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర మీడియా కన్వీనర్ మాళిగి భానుప్రకాశ్, వీహెచ్‌పీ రాష్ట్ర నాయకుడు టి. ప్రతాపరెడ్డి, జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, జిల్లా కార్యదర్శి ఈపూరి నాగరాజు, ఆర్ఎస్ఎస్ నాయకుడు రామకృష్ణ, బీజేపీ నాయకులు రంగస్వామి, కాశీ విశ్వనాథ్, ఏబీవీపీ జాతీయ కార్యదర్శి డాక్టర్ ఎం. నాగఫణిశాస్త్రి, ఆపస్ సత్యనారాయణ, కళ్లే చంద్రశేఖర్ శర్మ, రాజేశ్ శర్మ, మహిళా విభాగాల ప్రతినిధులు వరలక్ష్మి, దేవకీదేవిలతోపాటూ వివిధ ధార్మిక, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

దత్తాత్రేయ స్వామికి పూజలు

శ్రీశైలం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో గురువారం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద ఉన్న దత్తాత్రేయ స్వామివారికి లోకకళ్యాణం కోసం విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజలు చేసి, అనంతరం దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు జరిపారు.

గో సంరక్షణ పథకానికి విరాళం

శ్రీశైలం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం గోసంరక్షణ పథకానికి గురువారం విజయవాడకు చెందిన జి. ఓబులునాయుడు కుటుంబ సమేతంగా రూ. 1,50,000 విరాళాన్ని పీఆర్వో టి. శ్రీనివాసరావుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు రశీదు, స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

ప్రారంభమైన ధార్మిక కార్యక్రమాలు

నందికొట్కూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటా వీధిలోని వీరభద్ర స్వామి వారి దేవాలయంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ధార్మిక కార్యక్రమాలు ప్రారంభించారు. మద్రామాయణం, మహాభారతం, భగవద్గీత కేవలం ఇతిహాస గ్రంథాలు మాత్రమే కాదని, ఒక సామాజిక, రాజకీయ మరియు సాంస్కృతిక గ్రంథాలు కూడా అని టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డా.మల్లు వెంకటరెడ్డి అన్నారు. శ్రీమద్రామాయణం భారతీయ సంస్కృతిలో ప్రధాన భాగమైందన్నారు.

శ్రీశైల క్షేత్రంలో పారిశుధ్య పనులు



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఈవో

శ్రీశైలం, ఏప్రిల్ 24(ఆంధ్ర జ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీశైల క్షేత్ర పరిధిలో పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గంగాధర మండపం నుంచి నందిగుడి వరకు ఆలయ ఈవో ఎం. శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది ప్లకార్డులు పట్టుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్య కార్యక్రమం కోసం క్షేత్రపరిధిని 6 జోన్లు, 11 సెక్టార్లుగా, 66 ప్రదేశాలుగా విభజించి పారిశుధ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రతి జోనుకు దేవస్థానం యూనిట్ అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు. ప్రధాన రహదారులు ఆలయం ముందు గంగాధర మండపం నుంచి నందిగుడి వరకు దర్శనం క్యూకాంప్లెక్స్, అన్న ప్రసాద వితరణ భవనం, సీఆర్వో కార్యా లయం, మల్లికార్జున సదనం, దేవస్థానం వైద్యశాల, పీహెచ్‌సీ, సిద్ధరామప్ప వాణిజ్య సముదాయం, పాతళగంగమెట్లమార్గం, సాక్షి గణపతి, హటకేశ్వరం, శిఖరేశ్వరం, తదితర ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపట్టారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



సుభాన్

మహానంది, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బీపురం గ్రామానికి చెందిన అధ్యాపకుడు కంచి సుభాన్‌కు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన ప్రస్తుతం బేతంచెర్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గణిత విభాగంలో అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. గణిత శాస్త్రంలో 'హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ క్యారెక్టరిస్టిక్స్ ఆఫ్ మ్యాగ్నెటో హైడ్రో డైనమిక్ నాన్-న్యూటోనియన్ ఫ్లూయిడ్ ఫ్లో విత్ వేరియింగ్ ఫ్లో డైనమిక్స్' అనే అంశంపై పరిశోధన చేయడంతో అవార్డు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్, ఉపాధ్యాయులు, స్నేహితులు అభినందించారు.

దివ్యాంగులకు సౌకర్యాలు



సదరం క్యాంపులో ఏర్పాటు చేసిన షామియానాలు

నంద్యాల హస్పిటల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఏర్పాటు చేసిన సదరం వెరిఫికేషన్ శిబిరాల్లో దివ్యాంగులకు 'సౌకర్యాల కొరత' శీర్షికతో ఈనెల 17వ తేదిన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. సూపరిండెంట్ డాక్టర్ మల్లేశ్వరి స్పందించారు. దివ్యాంగులకు ఎండ తీవ్రత లేకుండా షామియానాలు ఏర్పాటు చేసి నీడతోపాటు కుర్చీలు ఏర్పాటు చేశారు.

డీఈవోకు సన్మానం



డీఈవోను సత్కరిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యజమానులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పది పరీక్షల్లో 19వ స్థానం నుంచి 17వ స్థానం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు డీఈవో జనార్ధన్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు రవీంద్రనాథ్, దండెదస్తగిరి, బాలచంద్రుడు, పడకండ్ల సుబ్రమణ్యం, రసూల్‌ఆజాద్‌లు మాట్లాడుతూ ఫలితాల మెరుగుకు డీఈవో తీసుకున్న చర్యలే కారణమన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలపై డీఈవోకు వినతిపత్రం అందజేశారు.

వ్యక్తి మృతి

గడివేముల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో గురువారం నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం పడమరనాయుడుపల్లి గ్రామానికి చెందిన కల్యాణ్‌కుమార్ మృతి చెందాడు. పని కోసం గడివేములకు వచ్చిన కల్యాణ్‌కుమార్ అతిగా మద్యం తాగి ఎండ తీవ్రత తట్టుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.


ఆందోళనలో అన్నదాతలు

- బైరవాణి చెరువు నుంచి మట్టి తరలింపునకు అధికారుల అనుమతులు
- బీడు భూములుగా మారనున్న వందలాది ఎకరాల సాగు భూమి



బైరవాణి చెరువు

మహానంది, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం గ్రామ పరిధిలో దాదాపు 250 ఎకరాల విస్తీర్ణంలో బైరవాణి చెరువు ఉంది. ఈ చెరువుకు వచ్చే నీటి నుంచి దాదాపు 500 ఎకరాల పైనే సాగు నీరు అందుతుండటంతో ఇక్కడి భూములు సస్యశ్యామలంగా ఉన్నాయి. దాదాపు 40 సంవత్సరాల క్రితం సాగు నీరు లేక బీడు భూములుగా ఉండేవి. టీడీపీ హయాంలో తెలుగుగంగ ప్రధాన కాలువను ఏర్పాటు చేశారు. గంగ సబ్ ఛానల్ ద్వారా చెరువుకు నీరు చేరుతుండటంతో ఇక్కడి భూములు సారవంతమయ్యాయి. దీంతో ఏటా రెండు కార్ల పంటలు సాగు అవుతున్నాయి. దీంతో వ్యవసాయ కూలీల నుంచి రైతులుగా మారారు. ప్రస్తుతం కొన్ని అభివృద్ధి పనుల కారణంగా అధికారులు చెరువు నుంచి మట్టిని తవ్వుకొనేందుకు అనుమతులు ఇవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 250 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బైరవాణి చెరువు నుంచి లక్ష క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించుకునేలా మైనింగ్‌శాఖ అధికారులు రైల్వే కాంట్రాక్టర్‌కు అనుమతులు ఇచ్చారు. దీంతో రైల్వే కాంట్రాక్టర్ స్థానిక నాయకుల సహకారంతో చెరువులో నిల్వ ఉన్న నీటిని తూముల ద్వారా బయటికి పంపిస్తున్నట్లు తెలిసింది. దీంతో ప్రస్తుతం పంటలు సాగు చేయాలనుకున్న రైతులు నిరాశతో ఉన్నారు. ఒక్కసారిగా లక్ష క్యూబిక్ మీటర్ల మట్టిని అభివృద్ధి పనుల కోసం చెరువు నుంచి తరలిస్తే తూములకు నీరు అందక పంట పొలాలకు సాగు నీరు అందే పరిస్థితి ఉండదు. దీంతో 500 ఎకరాల పైనే సాగు భూమి బీడు భూములుగా మారు తుంది. దీంతో రైతులుగా ఉన్న వందల కుటుంబాలు కూలీలుగా మారనున్నట్లు తెలు స్తోంది. అధికారులు రైతులను దృష్టిలో ఉంచుకొని చెరువు నుంచి మట్టిని తరలించేందుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేసి రైతుల అభివృద్ధి కోసం పాటు పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.



O/o. Chief Engineer Minor Irrigation A.P. Inward No: 7013 Date: 11/4/25 CEMI (I & CAD) CE: DCE-I: DCE-II:

GOVERNMENT OF ANDHRA PRADESH
WATER RESOURCES (MI-R) DEPARTMENT

Memo.No.ICD01-MINR/169/2025-MI-R(2784469) Dated:10-04-2025

Sub	Water Resources Department - Minor Irrigation – Nandyal District - Permission for lifting of 1,00,000 cum of silt/soil from Two MI tanks viz., (1) Bairavani cheruvu at Gopavaram (v), Mahanadi Mandal and (2) Pedha cheruvu at Ayyalur (v), Nandyala Mandal in Nandyal District for utilizing the soil lifted for the Proposed "Doubling of Track between Guntur and Guntakal Stations and utilizing the soil for the railway formation between Gajulapalli and Nandyal Stations - Accorded -Reg.
Ref	1.From the CE, M&MI, Vijayawada Letter.No.DCE- I/OT3/T1/KNL/ Soil permission- Railway Work, Dt.07.03.2025. 2.Govt., Memo No.10444/CAD.1/2014-12, Dt:11.02.2015.

*****

In the circumstances reported by the Chief Engineer, Minor & Medium irrigation, Vijayawada in the reference 1st read above, and after careful examination of the matter, Government hereby accord permission for lifting of Soils for a quantum of 1,00,000 CuM from the two minor irrigation tanks viz., (1) Bairavani cheruvu at Gopavaram (v), Mahanadi Mandal and (2) Pedha cheruvu at Ayyalur (v), Nandyala Mandal in Kurnool district, for utilizing the soil in the proposed construction of Guntur-Guntakal Doubling project work" subject to strict compliance of guidelines issued in the reference 2nd cited above and with the following conditions:

మట్టి తవ్వకాల కోసం మైనింగ్‌శాఖ ఇచ్చిన అనుమతుల పత్రం

సాగునీటికి ఇబ్బంది అవుతుంది



బైరవాణి చెరువు నుండి మట్టిని తరలిస్తే తూములకు సాగు నీరు అందక పంట భూములు బీడుగా మారే అవకాశం ఉంది. రైతులను దృష్టిలో ఉంచుకొని అధికారులు చెరువు నుండి మట్టిని తరలించకుండా వారికి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలి

- ప్రసాద్, గోపవరం

అనుమతులు రద్దు చేయాలి



ఎన్నో సంవత్సరాల నుండి చెరువుకు వచ్చే నీటిని పంట పొలాలకు ప్రవహింప చేసుకొని సస్యమలమైన పంటలను సాగు చేస్తున్నాం. ప్రస్తుతం అధికారులు ఇచ్చిన అనుమతులతో మట్టిని తరలిస్తే సాగు నీరు అందే అవకాశం లేదు. దీనితో సస్యమలమైన పంట భూములు బీడు భూములుగా మారే అవకాశం ఉంది. దీనిపై అధికారులు పునరాలోచించాలి.

- బాలచంద్రుడు, రైతు, గోపవరం

ఇంకా అనుమతి ఇవ్వలేదు.. పరిశీలిస్తున్నాం

గోపవరం బైరవాణి చెరువులో మట్టి తవ్వకాల కోసం రైల్వే శాఖ అనుమతి కోరింది. ఇప్పటి వరకు ఎలాంటి అనుమతివ్వలేదు. సినరజీ డిపాజిట్ (ప్రభుత్వానికి చెల్లించే రుసుం) కింద దాదాపు రూ.లక్షలాది చెల్లించాల్సి ఉంటుంది. లక్ష క్యూబిక్ మీటర్లు మట్టి తవ్వకాల కోసం రైల్వే శాఖ డబుల్ ట్రాక్ అభివృద్ధి పనుల కోసం అనుమతి కోరారు. గ్రామ రైతుల అంగీకారంతోనే మట్టి తవ్వకాలకు అనుమతిచ్చే అవకాశం ఉంది.

- అర్జున్‌సింగ్, ఏఈ, మైనర్ ఇరిగేషన్

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



పాములపాడులో పంచాయతీరాజ్ వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



పాణ్యంలో త్రోబాల్ పోటీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాణ్యం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం పాణ్యం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదట సర్పంచ్ పల్లవి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. అనంతరం పంచాయతీ రాజ్ శాఖ నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీలు, అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీవోను సన్మానించారు. అనంతరం సర్పంచ్‌లు, కార్యదర్శులు, అధికారులకు స్నేహపూర్వక ఆటల పోటీలు నిర్వహించారు. ఎంపీపీ ఉశేన్‌బీ, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళీశ్వరగౌడ్, సూపరింటెండెంట్ వరలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ సరోజినీ వర్జీనీయా, ఎంపీడీవో చంద్రశేఖర్ మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగోడు: వెలుగోడులోని సచివాలయం-1లో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి డీపీవో జమీవుల్లా పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సచివాలయ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామాల్లోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గురువారం ఆయా సచివాలయాలలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలను, పలువురు సిబ్బందిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయా సచివాలయాలలో ఏర్పాటు చేసిన సమావేశాలలో వారు మాట్లాడుతూ.. కార్యక్రమాలలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంత్రి అభినందనలు



విద్యార్థులతో మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో పలు ప్రైవేట్ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి అభినందనలు పొందారు.

- బాలా అకాడమీ పాఠశాలలో 592 మార్కులు సాధించిన అఫియా, 588 మార్కులు సాధించిన మధు, 550 మార్కులకు పైగా సాధించిన 25 మంది విద్యార్థులను మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అభినందించారు. 100కు 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ రవీంద్ర కుమార్ తెలిపారు
- నంద్యాల శాంతినికేతన్ పాఠశాలకు చెందిన మేటి 593 మార్కులు సాధించారని కరస్పాండెంట్ సుధాకర్ తెలిపారు. అలాగే ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ వారిని సత్కరించారు. సుధాకర్ మాట్లాడుతూ తమ విద్యార్థుల విజయం విద్యాసంస్థలకు ఎంతో గర్వకారణమన్నారు.

క్షేత్రస్థాయిలో కమిటీ పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

గడివేముల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిలకలగూడురు గ్రామ సమీపంలో ఉన్న జిందాల్ పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యం వల్ల పంటలు దెబ్బతిని నష్టపోతున్నామని రైతులు ఫిర్యాదు చేయడంతో గురువారం ఆర్డీవో విశ్వనాథ్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో కమిటీ పరిశీలించింది. జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, కాలుష్య నియంత్రణశాఖ ఈఈ కిషోర్‌రెడ్డి, ఏఎస్పీ మందజావలి రైతులతో చర్చించారు. కాలుష్య ప్రాంతాన్ని పరిశీలించారు. జిందాల్ పరిశ్రమ కాలుష్యం పంటలపై పడటంతో పైరు ఎదుగుదల మందగించి దిగుబడి తగ్గిందని, నాసిరకమైన ధాన్యం పండుతుందని రైతులు అన్నారు. బహిరంగ మార్కెట్‌లో ధాన్యానికి తక్కువ ధర అడుగుతున్నారని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంటకోత ప్రయోగాలు చేపట్టి నష్టాన్ని అంచనా వేయాలని డీఏవో మురళీకృష్ణ ఏవో హేమసుందర్ రెడ్డిని ఆదేశించారు. పంట నష్టంపై అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

కశ్మీర్‌లో ఉగ్రదాడిపై నిరసన



నంద్యాలలో ర్యాలీ

నంద్యాల కల్చరల్/రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ ఉగ్రవాద దాడిని నిరసిస్తూ గురువారం వీహెచ్‌పీ, బీజేపీ, హిందూ పరిరక్షణ వేదిక, హిందూ సంఘాలు తదితర సంస్థల ఆధ్వర్యంలో భారీ నిరసన శాంతియుత ర్యాలీ నిర్వహించారు. నందిఫైప్స్ ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తమకు అవకాశం ఇస్తే సైన్యంలో చేరడానికి సిద్ధంగా ఉన్నామని నంద్యాల జిల్లా మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు రంగనాయకులు తెలిపారు. చనిపోయిన వారికి గురువారం మాజీసైనికుల కార్యాలయంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. తీవ్రవాదులను శిక్షించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య అని జనసేన నాయకులు గురుబాబు, రాము పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి మౌనదీక్ష చేపట్టారు.

ఆత్మకూరు: కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడికి పాల్పడటం అమానుషమైన చర్య అని బీజేపీ నాయకులు గరుడాద్రి సుదర్శన్, ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ వాసుదేవరెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులు శ్రీధర్‌గుప్తా, ఆవులరెడ్డి, బ్రాహ్మణ సంఘం నాయకులు గరుడాద్రి సత్యనారాయణశర్మ, ఆర్యవైశ్య సంఘం నాయకులు నరహరి సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా పహల్గామ్ ఉగ్రవాద చర్యలను వ్యతిరేకిస్తూ హిందూ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ, మానవహారం చేశారు. మరణించిన వారికి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. జనసేన పార్టీ నాయకులు అరుణ్, హరీష్ తదితరులు గౌడ్‌సెంటర్ నందు అమరుల చిత్రపటాలకు నివాళి అర్పించారు.

సున్నిపెంట: జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ గురువారం రాత్రి సున్నిపెంటలో ప్రజలు శాంతియుతంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బీజేపీ శ్రీశైలం మండల అధ్యక్షుడు చదువు శ్రీను, నాయకులు వెంటేశ్వర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలుగోడు: దేశంలో ప్రవేశించే ఉగ్రవాదులను తుద ముట్టించాలని కూటమి నాయకులు డిమాండ్ చేశారు. జమ్మూ కశ్మీర్‌లో జరిగిన హింసాకాండను నిరసిస్తూ వెలుగోడులో కొవ్వొతులతో ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి, మోమిన్ రసూల్, ఖలీల్, జాకీర్ హుసేన్, వెంకటరమణ, వీరభద్రుడు, జనసేన నాయకులు శాలుబాషా, శ్రీరాములు, బీజేపీ నాయకులు ప్రతాప్ ఆచారి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

నందికొట్కూరు: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తున్నట్లు నందికొట్కూరు నియోజకవర్గ జనసేన నాయకుడు రామిరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలో జనసేన కన్నీటి నివాళి కార్యక్రమాన్ని చేపట్టారు. వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ తోళ్ల మంజునాథ్, జనసేన నాయకులు పవన్ కుమార్, సంధ్యా విక్రమ్ కుమార్, కటిక మహమ్మద్ షబ్బీర్ బోయ గోవిందు పాల్గొన్నారు.

పాములపాడు: జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడిచేసి పర్యాటకులను చంపడం హేయమైన చర్య అని బీసీ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ఎస్ఆర్ గోపాల్, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు అంకన్న, జాతీయ బీసీల కార్యదర్శి బత్తుల సంజీవరాయుడు, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు అబ్రహాం అన్నారు. పాములపాడులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

గడివేముల: జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ మండలంలోని బిలకలగూడురు గ్రామంలో గురువారం జనసేన నాయకులు వెంకటేశ్వర్లు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జనసేన, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'నియామకాల్లో రాజకీయ జోక్యం సరికాదు'

ఆత్మకూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఏపీ బెవరేజేస్ కార్పొరేషన్ నంద్యాల గోదాములో హమాలీ కార్మికుల నియామకాల్లో రాజకీయ జోక్యాలు సరికాదని సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, రణధీర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసింహ నాయక్ అన్నారు. గురువారం ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. బేవరేజ్ కార్పొరేషన్ గోదాములో 36 మంది హమాలీ కార్మికులను నియమించుకునేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ నియామకాల్లో నిబంధనలు పాటించకుండా రాజకీయ ఒత్తిళ్ల మేరకు నియామకాలు జరిపారని ఆరోపించారు. ప్రత్యేకించి ఓ ముఖ్య ప్రజాప్రతినిధి సిఫారసు చేస్తే తప్ప కార్మికులను నియమించుకోవడం లేదని మండిపడ్డారు. నాయకులు రాజేష్, మల్లయ్య, రవి, శివ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

బండిఆత్మకూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు నరసింహ నాయక్, మండల కార్యదర్శి డేవిడ్ కోరారు. మండలంలోని పెద్దదేవళాపురం గ్రామంలో గురువారం ఉపాధి పనుల వద్ద వారు కూలీలతో సమావేశం నిర్వహించారు. ఇంతవరకు కూలీలకు రావాల్సిన 9 నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

పాములపాడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పాములపాడులోని రైతుసేవా కేంద్రంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు పతంజలి ఫుడ్స్, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి చందన, మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డి, పతంజలి ఫుడ్స్ జిల్లా మేనేజరు మహదేవయ్య మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు చేస్తే ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ, అంతర్ పంటసాగు, పండించిన వాటిని కొనుగోలు తదితర అంశాలను తెలియచేశారు. కార్యక్రమంలో ఉపాధధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరకట్నం కోసం వేధింపులు.. కేసు నమోదు

మిడుతూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామానికి చెందిన మొల్లా చాంద్ బాషా కూతురు షహీనను మూడేళ్ల క్రితం వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామానికి చెందిన ఇనాయతుల్లాతో వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. అయితే కొంత కాలం నుంచి తన భర్త ఇనాయతుల్లా అదనపు కట్నం కోసం వేదిస్తున్నాడని షహీన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

బండిఆత్మకూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని సర్వే ఏడీ జయరాజ్, ఐవో కృష్ణకుమార్ అన్నారు. గురువారం కడమలకాల్వ గ్రామంలో జరుగుతున్న భూ రీ సర్వేను వారు పరిశీలించారు. అనంతరం సచివాలయంలో రికార్డులు పరిశీలించి సర్వే తీరు తెన్నులను స్థానిక సచివాలయ సర్వేయర్‌ను అడిగి తెలుసుకున్నారు. కృష్ణనంది ఆలయం, అటవీ హద్దుల కొలతల రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ పద్మావతి , రవీంద్రపాల్, షహీనా పర్వీన్, వీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

త్వరలో గో ప్రదర్శన

మహానంది, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో త్వరలో గో ప్రదర్శను నిర్వహిస్తున్నట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం శ్రీశైలం నుంచి మహానందికి తీసు కొచ్చిన నూతన కపిల గోవును ఈవో పరిశీలించారు. భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో నిత్యం ఏదో ఒక సమయంలో గో ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా తీసుకొస్తామని చెప్పారు. ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

'కార్మికుల జీవితాలతో చెలగాటం వద్దు'

నంద్యాల రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బేవరేజెస్ హమాలీ కూలీల జీవితాలతో చెలగాటమాడితే సహించబోమని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. గురువారం పట్టణ సమీపంలోని బేవరేజెస్ కార్పొరేషన్ ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎం.ఎల్.ఎల్ డిపోలో పని చేస్తున్న కార్మికుల కడుపు కొట్టాలని ఓ ప్రజా ప్రతినిధి అధికారంతో కార్మికుల పట్ల అన్యాయానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కమిటీ ఏర్పాటు చేసి తమకు నచ్చిన వారిని కార్మికులుగా తీసుకుంటున్నారని, దరఖాస్తు చేసుకున్న వారిని పట్టించుకోవడం లేదన్నారు. కమిటీ విడుదల చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, బేవరేజెస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అభినందన సభ

కొత్తపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో కొత్తపల్లి మండలంలోని గోకవరం ప్రభుత్వ జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. దీంతో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ ఆచారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం స్థానిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి అభినందన సభ ఏర్పాటు చేసి అభినందించారు. 13 మంది విద్యార్థులు పరీక్షలు రాసి 13 మంది విజయంతో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, సుబ్రహ్మణ్యం, కలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

పాతబస్టాండులో చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు

బేతంచెర్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాతబస్టాండులో నంద్యాల జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చలివేంద్రం ప్రారంభోత్సవానికి ముందు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. తీవ్రమైన ఎండలు ఉండటంతో ప్రజల దాహార్తిని చల్లని తాగునీరు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు బొగ్గరపు ధనుంజయ తెలిపారు. కార్యక్రమంలో గుండా గోపాల్, కందగడ్డల జనార్దన్, ఆలంపల్లి మధుసూదన్‌గుప్తా, ఆలవాల హరికృష్ణ, పలుకూరు శ్రావణ్, భీమ్‌శెట్టి, రాజేంద్రకుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆలయ భూములకు వేలం

కోవెలకుంట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుగొట్ల గ్రామంలో చెన్నకేశవస్వామి ఆలయ భూములకు గురువారం వేలం పాట నిర్వహించారు. మండల టీడీపీ ఉపాధ్యక్షుడు అర్జున్‌రెడ్డి చెన్నకేశవస్వామి ఆలయ ధర్మకర్త నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఈ వేలం కొనసాగింది. గ్రామానికి చెందిన ఐదు మంది రైతులు 40 ఎకరాల ఆలయ భూమికి రూ.4.93లక్షలు పాట పాడి దక్కించుకున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

డోన్ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరా నగర్‌లో నివాసముంటున్న ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు హుశేన్ పీరా తల్లి మృతికి డోన్ టీడీపీ యువ నాయకులు ధర్మవరం మన్నె గౌతమ్ కుమార్ రెడ్డి సంతాపం తెలిపారు. వారి నివాసం వద్దకు వెళ్లి మృతురాలి భౌతకకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి గౌతమ్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మే డేను జయప్రదం చేయాలి



సమావేశమైన సీఐటీయూ నాయకులు

డోన్ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మే డే వేడుకల్లో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు ఏవీ భాస్కర్‌రెడ్డి, రామాంజనేయులు, రైతుసంఘం మండల గౌరవాధ్యక్షులు కోయలకొండ నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో సీఐటీయూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఆర్డీటీ సెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

ప్యాపిలి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సెట్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఆసంస్థ ప్రతిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదిలో 500 మార్కులు పైన సాధించి, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన అన్నివర్గాల విద్యార్థులు ఈ సెట్‌కు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 30వ తేదీకి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9398175738 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఘనంగా రామ్‌కో సిమెంట్ ఫౌండర్స్ డే

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కొలిమిగుండ్ల సమీపంలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో గురువారం ఫౌండర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పరిశ్రమ అడ్మిన్ హెడ్ రామరాజు, మాన్యుఫ్యాక్చరింగ్ హెడ్ మీనాక్షీసుందరం ఆధ్వర్యంలో ఫౌండర్ పీఏసీ రామస్వామి రాజా జయంతిని పురస్కరించుకొని క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి, శివాలయం నుంచి పరిశ్రమ వరకు టార్చ్ ర్యాలీ నిర్వహించారు.అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్లకు చెందిన విద్యార్థి మధుహేమంత్ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి, సిల్వర్ మెడల్ సాధించాడు. ఈనెల 21 ,22, 23 తేదీల్లో ఏలూరు జిల్లా తోటపల్లి గ్రామంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో నంద్యాల జిల్లా నుంచి ఐదుగురు విద్యార్థులు పాల్గొన్నారు. మధుహేమంత్ అండర్-14 100 మీటర్లు పరుగు పందెంలో మెడల్ సాధించారు. అతడిని, కోచ్ ఓబన్నను అభినందించారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ మధ్దినేని రమేష్‌బాబు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిన్నపాటి నిర్లక్ష్యం మీ కుటుంబంతో పాటు, మీఎదుటివారి కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుందన్నారు. అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి వాటికి ఎవ్వరూ పాల్పడవద్దని విజ్ఞప్తిచేశారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు.

ఘనంగా సత్యసాయి ఆరాధనోత్సవం

కోవెలకుంట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పుట్టపర్తి సాయిబాబా వర్ధంతి సందర్భంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ శివారెడ్డి కాలనీలోని సత్యసాయి మందిరంలో పుట్టపర్తి సాయిబాబా విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. భక్తులు భజన కార్యక్రమాలు చేశారు. అనంతరం ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు చిత్రాన్నం, కేసరి, మజ్జిగ పంపిణీచేశారు.

అసలైన రైతులకు అందాలి : ఎమ్మెల్యే

ఆళ్ళగడ్డ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం అసలైన రైతులకు చెందేలా చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశించారు. గురువారం స్థానిక వ్యసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నలు కొనుగోలుకేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జొన్నల కొనుగోలు కేంద్రం పెట్టడం ముఖ్యం కాదని రైతులకు త్వరగా డబ్బులు వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆళ్లగడ్డలోనే టెస్టింగ్ కేంద్రం ఏర్పాటుకు కృషిచేస్తామని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. వ్యవసాయశాఖ ఏడీ రాంమోహన్‌రెడ్డి, కోవెలకుంట్ల ఏడీ సుధాకర్, మార్కెట్ యార్డుకార్యదర్శి నారాయణస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, ఉసేన్‌బాష పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధే లక్ష్యం

చాగలమర్రి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి ప్రభుత్వ ఉన్నతపాఠశాల అభివృద్ధే లక్ష్యమని దాతలు సంజీవరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో కొత్తగా రూ.లక్ష నిధులతో ఏర్పాటుచేసిన స్టేజీని హెచ్‌ఎం జీవయ్యతో కలిసి ప్రారంభించారు. పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు తమ వంతు కృషి చేస్తామని అన్నారు. టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగలు అరెస్టు

బేతంచెర్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి మూడున్నర తులాల బంగార ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని ముద్దవరానికి చెందిన మధుసురేష్ అనే వ్యక్తి ఇంట్లో ఈ నెల 15న రాత్రి చోరీ జరిగింది. కేసు నమోదుచేసి పోలీసు సిబ్బంది గాలింపు చేపట్టారు. గురువారం సాయంత్రం ఆర్ఎస్ రంగాపురంలో నిందితులు కాలింగిరి సురేంద్ర కుమార్, రెడ్డి పోగుల వికాస్‌ను అరెస్టుచేసి వారి నుంచి సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు

గుంత కనపడితే ఒట్టే..

ప్రయాణం.. సుఖప్రదం..!

- రోడ్లపై గుంతలు పూడ్చివేత
- రహదారులపై దృష్టి పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- లక్ష్యాన్ని పూర్తి చేసిన అధికారులు
- ప్రజల హర్షం



కొలిమిగుండ్లలో రోడ్లపై గుంతలు పూడ్చుతున్న సిబ్బంది(ఫైల్)



గుంతలు లేని రోడ్డు

కొలిమిగుండ్ల, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి) : మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఇలాఖాలో రోడ్డుపై గుంత కనపడితే ఒట్టే. రోడ్లపై గుంతల నుంచి ప్రజలకు విముక్తి లభించింది. దీంతో వాహనదారులు రయ.. రయ్ మంటూ పరుగులు తీస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారుల మరమ్మతులను గాలికొదిలేశారు. ప్రజలు తీవ్ర కష్టాలను ఎదుర్కొన్నారు. శిథిలమైన రహదారుల్లో ప్రయాణం నరకప్రాయంగా మారి, నిత్యం ప్రమాదాలకు దారితీసిన పరిస్థితి.

రోడ్లకు అత్యంత ప్రాధాన్యం..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్లకు అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా గుంతలు పూడ్చడానికి రూ.861కోట్లు నిధులు కేటాయించి, 95శాతానికి పైగా పనులు పూర్తిచేశారు. జిల్లాకు చెందిన రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి నిత్యం సమీక్షలతో అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. మంత్రి బీసీ సొంత నియోజకవర్గమైన బనగానపల్లె నియోజకవర్గంలో గుంతల రహదారులన్నీ పూర్తిగా మారిపోయాయి. అనంతపూర్-అమరావతి ప్రధాన హైవేతో పాటు, గ్రామీణ, పట్టణాల రహదారులన్నీ గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దారు. ఉమ్మడి కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం నిర్ధేశించుకున్న 1252 కిలో మీటర్ల మేర గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ఇప్పటికే విజయవంతంగా పూర్తి చేశారు. తిరిగి ఎక్కడైనా గుంతలు ఏర్పడినా వెంట వెంటనే అధికారులు వాటిని పూడ్చి వేయడానికి చర్యలు చేపడుతుండటం ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



ఆళ్లగడ్డలో శోభానాగిరెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ



రుద్రవరంలో శోభానాగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాలులర్పిస్తున్న టీడీపీ నాయకులు

శోభానాగిరెడ్డి సేవలు మరవలేనివి

- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ
- భూమా శోభా నాగిరెడ్డికి ఘన నివాళి
- రక్తదానం చేసిన నాయకులు, కార్యకర్తలు

ఆళ్ళగడ్డ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు భూమా శోభానాగిరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని, అందుకే ఆమె ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం ఆళ్లగడ్డలోని భూమాఘాట్ వద్ద ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, యువనాయకుడు భూమా జగత్ విఖాత్‌రెడ్డి, భార్గవ్‌రామ్ భూమానాగిరెడ్డి, శోభానాగిరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శిరివెళ్ల టీడీపీ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. సినీ నటుడు మంచు మనోజ్, సతీమణి మోనికా భూమా ఘాట్‌కు చేరుకొని శోభానాగిరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుల ర్పించారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రి యతో పాటు భూమా జగత్ విఖాత్‌రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు.

టీడీపీ నాయకుడి ఆధ్వర్యంలో..

దొర్నిపాడు: మండలంలోని దొర్నిపాడులో టీడీపీ నాయకుడు సిద్ధి సత్యనారాయణ ఆధ్వర్యంలో భూమా శోభానాగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిద్ధి సత్యనారాయణ మాట్లాడుతూ భూమా కుటుంబం ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. మాజీ సర్పంచ్ సిద్ధినారాయణ, పగడాల రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీనివాసులు, గుర్రప్ప ఉన్నారు.

శోభానాగిరెడ్డి సేవలు చిరస్మరణీయం..

శిరివెళ్ల: దివంగత ఎమ్మెల్యే భూమా శోభానాగిరెడ్డి సేవలు చిరస్మరణీయమని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని శిరివెళ్ల, మోత్కలపల్లె, యర్రగుంట్ల తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి గురువారం నివాళి అర్పించారు. సూరా రామ, కొత్తపేట జిక్రియా, ఉల్లి వెంకట సుబ్బయ్య, యామా శ్రీనివాసులు, కొండబోయిన బాలచంద్రుడు, తిరుమల రవి, భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు మరువలేకున్నారు..

రుద్రవరం : శోభానాగిరెడ్డి సేవలు ఆళ్లగడ్డ ప్రజలు మరువలేకున్నారని టీడీపీ మండల కన్వీనరు రంగనాయకులు అన్నారు. రుద్రవరంలో శోభానాగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు పోలా గురుమూర్తి, నంద్యాల పార్లమెంటు ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, చంద్రశేఖర్, శివ పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో..

చాగలమర్రి: దివంగత ఎమ్మెల్యే శోభానాగిరెడ్డి సేవలు మరువలేనివని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నంద్యాల బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, నంద్యాల మైనార్టీసెల్ నాయకుడు కొలిమి ఉసేన్‌వలి, మాబుషరీఫ్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, దూదెకుల సంఘ అధ్యక్షుడు మహబూబ్‌బాష, టీడీపీ నాయకులు అనిఫ్, జెట్టి నాగరాజు, మాబులాల్, గఫార్, జల్సాగౌస్, భాస్కర్‌రెడ్డి, రమేష్, అస్రఫ్, ఓబులేసు, రియాజ్, నాగూర్‌వలి, అబ్దుల్‌ఖాదర్, బషీర్ పాల్గొన్నారు.



చాగలమర్రిలో..

సమష్టి నిర్ణయాలతో పంచాయతీల అభివృద్ధి

- ఎంపీడీవో సాల్మన్ • ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం • ఉద్యోగులకు సన్మానం



సంజామలలో మాట్లాడుతున్న ఎంపీడీవో సాల్మన్

సంజామల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సమష్టి నిర్ణయాలతో పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో సాల్మన్ అన్నారు. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని అన్ని గ్రామ పంచాయతీల్లో ఘనంగా నిర్వహించారు. సంజామల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ రాధికారెడ్డి, పంచాయతీ కార్యద ర్శులు లక్ష్మయ్య, వెంకటనారాయణ, భారతి, నాగలక్ష్మి, సుధాకర్, ఆయా గ్రామ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం

కోవెలకుంట్ల: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖలో పని చేస్తున్న డిప్యూటీ మండల అభివృద్ధి అధికారి ప్రకాశ్‌నాయుడు, మండల పంచాయతీరాజ్ ఇంజనీరు, సీనియర్ సహాయకులు రామసుబ్బయ్యను ఎంపీడీవో వరప్రసాదరావు, పంచాయతీరాజ్ కార్యదర్శులు సురేంద్రనాథరెడ్డి, మల్లీశ్వరి, జ్యోతితో పాటు అందరు పంచాయతీ కార్యదర్శులు కలిసి వారిని ఘనంగా సత్కరించారు. పంచాయతీ రాజ్ శఖ అభివృద్ధికి కృషి చేసినందుకు పూల మాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు.

గాంధీజీ కలలుకన్న..

చాగలమర్రి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ సహాయకులు బాలనరసింహులు, ఉపాధి ఏపీవో ఖాసీం మాట్లాడుతూ గాంధీజీ కళలుకన్న గ్రామ స్వరాజ్యం పంచాయతీరాజ్ వ్యవస్థకు నిదర్శనమని కొనియాడారు. దేశానికి పట్టుకొమ్మలు గ్రామ సీమలు అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సహాయకులు బషీర్‌అహ్మద్, పంచాయతీ కార్యదర్శులు ఆదినారాయణ, షబియా, నాగార్జున, మనోజ్, కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్, సచివాలయ, ఎన్ఆర్‌జీఎస్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు అన్యాయం : సీఐటీయూ

బేతంచెర్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ నంద్యాల గోడౌన్‌లో అదనంగా హమాలీలను పనుల్లోకి తీసుకోవడంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చేతివాటం చూపటంతో హమాలీలకు అన్యాయం జరిగిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో పాతబస్టాండులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లయ్యతో పాటు జిల్లా నాయకులు వైబీ వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ నాయకులు మధుశేఖర్ మాటాడారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక కమిటి ఏర్పాటుచేసి ఖాళీగా ఉన్న 36మంది హమాలీలను తీసుకునేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. స్థానికులైన దాదాపు 170మంది హమాలీ పనికోసంఅప్లయ్ చేసుకున్నా రన్నారు. మంత్రి ఫరూక్ హమాలీ పనికోసం రూ.లక్షల్లో చేతివాటం చూపించి ఎలాంటి ఇంటర్వ్యూ లేకుండా తీసుకోవడంలో సరైంది కాదన్నారు.

అమాయకులను చంపడం దారుణం : సుబ్బారెడ్డి



ప్యాపిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ పరిరక్షణ వేదిక నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి

డోన్ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులు అమాయకులను చంపడం దారుణమని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం ఎంఎస్ఆర్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఉగ్రదాడిలో చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. మరణించిన వారిలో ఇద్దరు తెలుగు వారు ఉండటం చాలా బాధాకరమన్నారు. భారత ప్రభుత్వం ఉగ్రదాడికి పాల్పడిన వారిని త్వరలో తగిన గుణపాఠం చెబుతుందని తెలిపారు. కాళహస్తి సీడ్స్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. సుబ్బారెడ్డికి అక్కడి అధికారులు, సిబ్బంది పూలమొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. అంతకు ముందు కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ యువ నాయకులు మన్నె గౌతమ్‌కుమార్ రెడ్డి ఉన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ

ప్యాపిలి: కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ గురువారం ప్యాపిలిలో హిందూ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పురవీదుల గుండా సాగింది. ఈఘటనకు పాల్పడిన ఉగ్రవాదులను ఉరితీయాలన్నారు. నాయకులు రామాంజినేయులు, రామ్మోహన్‌యాదవ్, నరేష్ పాల్గొన్నారు.

హేయమైన చర్య

బనగానపల్లె : కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి, రాష్ట్ర కార్యదర్శి మధుసూధన్‌రావు అన్నారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఉగ్రదాడిలో మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు. మండల అధ్యక్షుడు వెంకటకృష్ణుడు, రాష్ట్ర కౌన్సిలర్లు సుబ్బరాయుడు, గోవిందనాయక్, పోలియానాయక్, ఓబులేసు, రమేశ్ , సుంకన్న, శేఖర్, మహమ్మద్‌ఖాద్రి, మహమ్మద్ రఫి పాల్గొన్నారు.

ఐటీ అభ్యర్థులకు ఆన్‌లైన్ పరీక్ష

చాగలమర్రి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ ఆదేశాలమేరకు ఆయా సచివాలయాల్లో వర్క్‌ఫ్రం హోమ్ ఐటీ అభ్యర్థులకు గురువారం ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. చాగలమర్రి గ్రామంలోని నాలుగో సచివాలయంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ పరీక్షను మండలపరిషత్ కార్యాలయ అధికారులు బాబు, కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్ పరిశీలించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా ఐటీగ్లోబల్ క్యాపబుల్టి ఏకో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి వర్క్‌ఫ్రం హోమ్ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 300 మంది వర్క్‌ఫ్రం హోమ్ అభ్యర్థులను గుర్తించినట్లు తెలిపారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

చాగలమర్రి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఏపీవో ఖాసీం తెలిపారు. ప్రస్తుతం 2046 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని అన్నారు. గురువారం ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వంద రోజుల పనిదినాలు కల్పించాలని సూచించారు. మస్టర్లు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. గ్రామాల్లో ఆసక్తి ఉన్న రైతులు పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఈసీ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జరిమానా

రుద్రవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బండి ఆత్మకూరు గ్రామానికి చెం దిన రమేశ్, ఆలమూరు గ్రామానికి చెందిన నారాయణ, వెంకటబాబుపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేసి గురువారం కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి వారిద్దరికి ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.

రీసర్వే పనుల పరిశీలన

శిరివెళ్ల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీనేపల్లె గ్రామంలో జరుగుతున్న భూరీసర్వే పనులను తహసీల్దార్ పుష్ప కుమారి గురువారం పరిశీలించారు. రీసర్వే పురోగతిని మండల సర్వేయర్ చిన్న మల్లయ్యను అడిగి తెలుసుకున్నారు. రైతుల సమక్షంలో పకడ్బందీగా రీ సర్వే చేపట్టాలని ఆదేశించారు.

పండ్ల తోట సాగుతో అధిక లాభాలు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పండ్ల తోటల సాగుతో అధిక లాభాలు సాధించొచ్చని ఎంపీడీవో వరప్రసాద్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి కుటుంబంలో ఐదు ఎకరాల లోపు పొలం ఉండి, బోరు లేదా నీటి వసతి కలిగిన రైతులు పండ్ల మొక్కలు సాగు చేసేందుకు ప్రభుత్వం మంజూరు చేయనున్నందన్నారు.

ఇసుక లారీ పట్టివేత

రుద్రవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం సమీపంలో అధిక లోడుతో వస్తున్న ఇసుక లారీని పట్టుకున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ గురువారం తెలిపారు. వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు నివేదికలు పంపించామన్నారు. లారీలో అధికలోడు ఉన్నట్లు గుర్తించిఅధికారులకు సమాచారంతో పాటు నివేదిక పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

పిచ్చికుక్క దాడి.. బాలుడికి గాయాలు

చాగలమర్రి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసి నాలుగేళ్ల బాలుడు పవన్‌పై గురువారం దాడి చేసి గాయపరిచింది. అలాగే అదే కాలనీలో ఓ గేదెపై కూడా దాడి చేసింది. గాయపడిన బాలుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.

అందరికీ న్యాయం అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న సివిల్ న్యాయాధికారి అబ్దుల్‌రహిమాన్

బనగానపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అందరికీ న్యాయం అందించడమే తన ధ్యేయమని బనగానపల్లె సివిల్ న్యాయాధికారి అబ్దుల్ రహిమాన్ అన్నారు. గురువారం పట్టణంలోని కోర్టు ఆవరణంలో బదిలీపై వెళ్తున్న న్యాయాధికారికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజాహుసేన్, సెక్రటరీ శ్రీనివాసమూర్తి, ఉపాధ్యక్షుడు జాకీర్‌హుసేన్ ఆధ్వర్యంలో బనగానపల్లె న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. న్యాయవాదులు పరుశురామిరెడ్డి, మా ధవరెడ్డి, యూసుఫ్‌హుసేన్, వెంకటేశ్వరరెడ్డి, అబ్దుల్‌ఖైర్, జడ్.కృష్ణారెడ్డి, ఆజాంహుసేన్, ఎం.రఘురామిరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటేశం, ఇర్ఫాన్, తులశీశ్వరమ్మ, బాబావలి, అల్లావుద్దీన్ పాల్గొన్నారు.

రసాయన ఎరువులు తగ్గించాలి: ధనలక్ష్మి

బనగానపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో రసాయనిక ఎరువులు తగ్గించాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, యూనిట్ హెడ్ ధనలక్ష్మి తెలిపారు. గురువారం కృషి విజ్ఞాన కేంద్రం, మద్రాస్ ఫర్టిలైజర్స్ సంయుక్త ఆధ్వర్యంలో పీ.ఎం ప్రణామ్ పథకం పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ రసాయనిక ఎరువులను ప్రత్యామ్నాయంగా ప్రకృతి వ్యవసాయం, ఇతర పరిరక్షణ వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలన్నారు. మద్రాస్ ఫర్టిలైజర్స్ చీఫ్ మేనేజరు ఆదినారాయణస్వామి మాట్లాడుతూ పీఎం ప్రణామ్ పథకంలో బాగంగా విజయసేంద్రీయ ఎరువులు, పురుగుమందులు గురించి వివరించారు. భూశాస్త్రవేత్త రమణయ్య మాట్లాడుతూ మట్టినమూనా సేకరించే పద్ధతి వివరించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త బాలరాజు మాట్లాడుతూ ప్రధాన పంట చేయడానికి ముందు సాగుచేసి పొలం కలియదున్నడంతో ఎరు వుల అవసరం తగ్గి, సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

అవుకు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని చల్లా విఘ్నేశ్వరరెడ్డి గురువారం అన్నారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్‌ను బహూకరించి సత్కరించారు. విద్యార్థులను టాపర్లుగా నిలిపిన ఏపీ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ హెమీమా, మదర్‌మోడల్‌స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసులును సన్మానించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.